SAMAYAM

epaper.samayamdaily.net APTEL/26/A3949

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

సమయం
మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565

సంపుటి: 1 | సంచిక: 79 | ఎడిటర్ : అలీ ముర్తుజా | శుక్రవారం 25 సెప్టెంబర్ 2026 | ప్రచురణ : విజయవాడ | పేజీలు: 8 | వెల: రూ.5 |



## 48 గంటల్లో సీఈసీ రాజీనామా చేయాలి

- జ్ఞానేశ్ కుమార్‌కు కాక్రోచ్ జనతా పార్టీ అల్టిమేటం
- లేకుంటే దేశవ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరిక
- రాజీనామా చేసే వరకు తగ్గేది లేదన్న అభిజీత్

4

## 'ఓటు చోరీ'తో గెలిస్తే.. ఆ చట్టాలూ చెల్లవు!

- ప్రధాన ఎన్నికల కమిషనర్ తక్షణమే రాజీనామా చేయాలి
- సీఈసీ అప్రూవర్‌గా మారడం మంచిది
- లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

4






## అప్రమత్తంగా ఉండాలి

- మంత్రి నిమ్మల!
- భారీ వర్షాల వేళ జలవనరుల శాఖ అలర్ట్
- రిజర్వాయర్లు, వాగుల ఇన్‌ఫ్లోలపై పర్యవేక్షణ
- మున్నేరు, బుడమేరు వరదలపై ప్రత్యేక దృష్టి
- ప్రజలకు ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా పక్కా ప్లాన్

వివరాలు 2వ పేజీలో





## విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడాలి

- అధికారులకు మంత్రి సవిత కీలక ఆదేశాలు


2

# వర్షపు నీటిని ఒడిసిపట్టాలి

16 జిల్లాల్లో భారీగా నమోదైన వర్షపాతం | వరద ముప్పుపై నిరంతర పర్యవేక్షణ!

### గోదావరి, కృష్ణా డెల్టాల్లోని రిజర్వాయర్లను నింపాలి

- అవసరమైన చోట మోటార్లతో నీటిని లిఫ్ట్ చేయాలి
- పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి నీటి మళ్లింపు
- నదులు, వాగుల్లో వరద ప్రవాహాలపై ప్రత్యేక పర్యవేక్షణ
- అధికారులకు సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు
- ఉత్తరాంధ్ర జిల్లాల్లో వర్ష ప్రభావంపై సమీక్ష



రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వాటి ద్వారా వస్తున్న వరద ప్రవాహాలతో అన్ని నీటి వనరులను నింపాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. కృష్ణా, గోదావరి డెల్టాలోని రిజర్వాయర్లతో పాటు పరిధిలోని ఇతర నీటి వనరులనూ నింపాలని స్పష్టం చేశారు. ఆర్టీజీఎస్ నుంచి నిర్వహించిన సమీక్షలో ఆయన రాష్ట్రవ్యాప్తంగా వర్ష ప్రభావంపై సమగ్రంగా చర్చించారు.

-సమయం న్యూస్, అమరావతి

వివరాలు 2వ పేజీలో

## రౌడీలతో దాడి.. జగన్ ప్లానే!

### తాడేపల్లి ప్యాలెస్ డైరెక్షన్‌లోనే విధ్వంసం

- క్రీడాకారులపై రాళ్లు, గాజు సీసాలతో దాడి దుర్మార్గం
- పోక్సో, మర్డర్ కేసులున్న వారితో వీరంగం
- ఆధారాలతో సహా మీడియాకు చూపించిన హోం మంత్రి అనిత

2



యువతకు ఉద్యోగాలు ఇవ్వడం కూటమి ప్రభుత్వ నైజమని, విద్యార్థులను రౌడీలుగా మార్చడం జగన్ నైజమని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజావేదిక కూల్చివేతతో మొదలైన విధ్వంసం, చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ వరకు కొనసాగి వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

## వేగమే ఏపీ ప్రభుత్వ కల్చర్!

- పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ ప్రత్యేక శైలి
- ఎంఓయూలు కాదు.. ప్రాజెక్టుల గ్రౌండింగే మా లక్ష్యం
- ఫైర్‌సైడ్ చాట్‌లో దార్శనికతను వివరించిన లోకేష్

2



## స్థానిక సమరానికి సిద్ధం కావాలి



- కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- బలమైన అభ్యర్థులను ముందుగానే గుర్తించాలి
- అధికార దుర్వినియోగాన్ని ధీటుగా ఎదుర్కోవాలి
- రీజినల్ కోఆర్డినేటర్లకు జగన్ దిశానిర్దేశం

3




## స్థానిక ఎన్నికలపై తీర్పు రిజర్వ్!

- ఏపీ హైకోర్టులో ముగిసిన కీలక విచారణ
- తీర్పుపైనే ఆధారపడ్డ స్థానిక సమరం భవితవ్యం

3

## మరో 807 మద్యం దుకాణాలకు నోటిఫికేషన్!

- రెన్యువల్ చేసుకోని 414 షాపుల లైసెన్సుల రద్దు
- అక్టోబర్ 1 అర్ధరాత్రి వరకు దరఖాస్తుల స్వీకరణ
- అక్టోబర్ 5 న లాటరీ ద్వారా పారదర్శకంగా కేటాయింపులు

వివరాలు 3వ పేజీలో



## లిక్కర్ స్కామ్ నిందితులకు బెయిల్!

- వాసుదేవరెడ్డి, రాజ్ కేసిరెడ్డిలకు ఊరట
- రూ. లక్ష పూచీకత్తుతో మంజూరు చేసిన ఈడీ కోర్టు

3

## గాల్లో చక్కర్లు.. టెన్షన్!

- భోగాపురంలో దిగాల్సిన విమానం నాగపూర్‌కు మళ్లింపు
- విమానంలో మంత్రులు అచ్చెన్నాయుడు, కొండపల్లి
- ప్రయాణికుల్లో మండలి ప్రతిపక్ష నేత బొత్స

3



# రౌడీలతో దాడి.. జగన్ ప్లానే!

**తాడేపల్లి ప్యాలెస్ డైరెక్షన్‌లోనే విధ్వంసం**

**క్రీడాకారులపై రాళ్లు, గాజు సీసాలతో దాడి దుర్మార్గం**

**పోక్సో, మర్డర్ కేసులున్న వారితో వీరంగం**

**ఆధారాలతో సహా మీడియాకు చూపించిన హోం మంత్రి అనిత**




**అమరావతి (సమయం న్యూస్):** యువతకు ఉద్యోగాలు ఇవ్వడం కూటమి ప్రభుత్వ నైజమని, విద్యార్థులను రౌడీలుగా మార్చడం జగన్ నైజమని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజావేదిక కూల్చివేతతో మొదలైన విధ్వంసం, చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ వరకు కొనసాగి వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అనిత మాట్లాడుతూ.. రాష్ట్రంలో క్రైమ్ రేటును 14 శాతం మేర తగ్గించామని, శాంతిభద్రతలు అదుపులో ఉండటం వల్లే వేల కోట్ల పెట్టుబడులు, లక్షల ఉద్యోగాలు వస్తున్నాయని స్పష్టం చేశారు. మంత్రి నారా లోకేష్ 16,000 మందికి పైగా ఉపాధ్యాయులను అత్యంత పారదర్శకంగా భర్తీ చేశారని మంత్రి కొనియాడారు. రిక్రూట్‌మెంట్ విధానంపై అసెంబ్లీలో బహిరంగ చర్చకు రావాలని 3 సార్లు సవాల్ విసిరినా జగన్‌కు అసెంబ్లీకి వచ్చే ధైర్యం లేకపోయిందన్నారు. కడపలో స్పోర్ట్స్ కోటా కింద ఎంపికైన క్రీడాకారులు తమ సర్టిఫికెట్లతో విజయవాడలోని శాప్ కార్యాలయానికి వచ్చి రక్షణ కోరితే, తాడేపల్లి ప్యాలెస్ డైరెక్షన్‌లో వైసీపీ రౌడీ మూకలు రాళ్లు, గాజు సీసాలతో పాశవిక దాడికి దిగడం దుర్మార్గమన్నారు.

శాప్ కార్యాలయం వద్ద నిరసనల పేరుతో వీరంగం సృష్టించిన వారిలో ఎక్కువ మంది నేర చరిత్ర కలిగిన రౌడీషీటర్లు, పోక్సో, హత్యాయత్నం కేసులు ఉన్నవారేనని హోం మంత్రి ఆధారాలతో సహా బయటపెట్టారు. గతంలో ఏపీపీఎస్సీ గ్రూప్-1 అక్రమాలు, లిక్కర్ స్కామ్‌లో వేల కోట్లు తాడేపల్లి ప్యాలెస్‌కు చేరాయన్న ఆరోపణలపై జగన్ ఎందుకు నోరు మెదపరని అనిత నిలదీశారు. తమ అవినీతి పాపాలు బయటపడటంతో ప్రజల దృష్టిని మళ్లించేందుకే డీఎస్సీపై తప్పుడు కూతలు కూస్తున్నారని దుయ్యబట్టారు. ఉపాధ్యాయులపై దాడికి తెగబడిన వారి వికృత చేష్టలన్నీ సీసీటీవీల్లో రికార్డయ్యాయని, రౌడీయిజంపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని మంత్రి హెచ్చరించారు.

# అప్రమత్తంగా ఉండాలి

**మంత్రి నిమ్మల!**

**భారీ వర్షాల వేళ జలవనరుల శాఖ అలర్ట్**

**రిజర్వాయర్లు, వాగుల ఇన్‌ఫ్లోలపై పర్యవేక్షణ**

**మున్నేరు, బుడమేరు వరదలపై ప్రత్యేక దృష్టి**

**ప్రజలకు ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా పక్కా ప్లాన్**

**క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశం**

**అమరావతి (సమయం న్యూస్):** రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జలవనరుల శాఖ యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. వర్షాలు, వరద పరిస్థితులపై ఆయన ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి సమగ్రంగా సమీక్షించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, కడా కమిషనర్ ప్రశాంతి, ప్రభుత్వ సలహాదారు వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తిలతో పాటు చీఫ్ ఇంజనీర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

## పంపుల ఆపరేషన్లపై స్పష్టమైన ఆదేశాలు..



వాతావరణ శాఖ నుంచి అందే ముందస్తు సమాచారాన్ని ఎప్పటికప్పుడు విశ్లేషిస్తూ, దానికి అనుగుణంగా వరద నియంత్రణ చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. రిజర్వాయర్లు, నదులు, వాగుల్లోకి వచ్చే వరద ప్రవాహాలను నిరంతరం అంచనా వేయాలని ఆదేశించారు. మున్నేరు నదికి వచ్చే ఇన్‌ఫ్లో, బుడమేరు వరద పరిస్థితిని పరిశీలిస్తూ అవసరానికి అనుగుణంగా పట్టిసీమ పంపులను నడపాలని మంత్రి నిమ్మల స్పష్టం చేశారు. ఏలేరు రిజర్వాయర్ క్యాచ్‌మెంట్ ప్రాంతంలో నమోదయ్యే వర్షపాతాన్ని పర్యవేక్షిస్తూ పరిస్థితులకు తగినట్లుగా పురుషోత్తపట్నం పంపులను ఆపరేట్ చేయాలని అధికారులకు సూచించారు.


## నదుల పరీవాహక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా..

ఉత్తరాంధ్రలోని వంశధార, నాగావళి, బహుదా, మహేంద్రతనయ నదుల ప్రవాహాలను నిరంతరం కనిపెట్టుకుని ఉండాలని మంత్రి ఆదేశించారు. ఆయా నదుల పరివాహక ప్రాంతాల్లోని ప్రజలను వరద పరిస్థితులపై ముందుగానే అప్రమత్తం చేయాలని సూచించారు.

## వార్ రూమ్ నుంచి నిరంతర పర్యవేక్షణ..

ఇరిగేషన్ అధికారులు వార్ రూమ్ ద్వారా పరిస్థితిని 24 గంటలూ పర్యవేక్షిస్తూ, అవసరమైన సూచనలను క్షేత్రస్థాయి సిబ్బందికి తక్షణమే అందించాలని మంత్రి ఆదేశించారు. ఉన్నతాధికారులు సైతం కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ పరిస్థితులను పర్యవేక్షించాలన్నారు. భారీ వర్షాలు, ఆకస్మిక వరదల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖల సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు.

# వర్షపు నీటిని ఒడిసిపట్టాలి!



**అమరావతి (సమయం న్యూస్):** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వాటి ద్వారా వస్తున్న వరద ప్రవాహాలతో అన్ని నీటి వనరులను నింపాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. కృష్ణా, గోదావరి డెల్టాలోని రిజర్వాయర్లతో పాటు పరిధిలోని ఇతర నీటి వనరులనూ నింపాలని స్పష్టం చేశారు. రియల్ టైమ్ గవర్నెన్స్ కేంద్రం (ఆర్టీజీఎస్) నుంచి ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన ఏఐ సాంకేతికత, డేటా అనలిటిక్స్, ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనే వ్యూహాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వర్ష ప్రభావంపై సమగ్రంగా చర్చించారు. తీవ్ర వాయుగుండం కారణంగా రాష్ట్రంలో గడచిన 3 రోజులుగా కురుస్తున్న వర్షాలతో భూగర్భజలాలు కొంత మేర పెరిగాయని అధికారులు సీఎంకు వివరించారు. ప్రకాశం బ్యారేజీ సహా మున్నేరు, ఇతర క్యాచ్‌మెంట్ ఏరియాల నుంచి 11 వేల క్యూసెక్కుల నీరు వస్తోందని చెప్పారు. ప్రాజెక్టుల దిగువన ఉన్న అన్ని నీటి వనరుల్లో వర్షపు నీటిని నిల్వ చేయాలని, అవసరమైన చోట మోటార్లను వాడి నీటిని లిఫ్ట్ చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. గోదావరి నుంచి వస్తున్న ప్రవాహాల ద్వారా 24 టీఎంసీల నీటితో ఏలేరు రిజర్వాయర్‌ను నింపాలని, పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి వరకు ఉన్న నీటి వనరుల్లోకి నీటిని పంపాలని ఆదేశించారు.

## నదుల ప్రవాహంపై పర్యవేక్షణ..

ప్రస్తుతం కొనసాగుతున్న వర్షాలు, గాలుల తీవ్రత, నదులు, వాగుల్లో పెరుగుతున్న ప్రవాహాలు, రిజర్వాయర్లలోకి చేరుతున్న వరద నీటిపై సీఎం సమీక్షించారు. గోదావరి బేసిన్‌లోని శబరి, ఇంద్రావతి, ఏలేరు, తాండవ, ఎర్రకాల్వ, పంపా, మేఘాద్రిగడ్డ రిజర్వాయర్లకు భారీగా వరద నీరు చేరుతోందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. రాబోయే రోజుల్లో ఉత్తర కోస్తా రిజర్వాయర్లకు ఇన్‌ఫ్లో గణనీయంగా పెరగనుంది. నాగావళి, వంశధార బేసిన్లలోనూ ప్రవాహాలు పెరగనున్నాయి. గొట్టా బ్యారేజీ వద్ద సెప్టెంబర్ 25 ఉదయానికి వార్నింగ్ లెవల్-1 కి, ధవళేశ్వరం బ్యారేజీ వద్ద సెప్టెంబర్ 27 ఉదయానికి వార్నింగ్ లెవల్-1 కి వరద చేరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. భద్రాచలం వద్ద సెప్టెంబర్ 26 మధ్యాహ్నానికి వార్నింగ్ లెవల్-1 దాటే అవకాశం ఉందన్నారు.

## ఎల్ నినో ఎదుర్కొనే వ్యూహం..

ఎల్ నినో లాంటి వాతావరణ పరిస్థితుల ప్రభావాన్ని తగ్గించేలా అంతర్గత పరిస్థితులను మార్చుకోవచ్చని సీఎం అన్నారు. భూసారాన్ని పెంచడం, సాయిల్ టెస్టింగ్ ఆధారంగా ప్రత్యామ్నాయ పంటలను సూచించడం, బయోచార్, ప్రకృతి వ్యవసాయం లాంటి విధానాల ద్వారా ఎల్ నినో ప్రభావాన్ని కొంతమేర తగ్గించవచ్చని తెలిపారు. అక్టోబర్ 2 న ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు శంకుస్థాపన చేయనున్నామని, అదే రోజు రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. నాసా ఉపగ్రహ చిత్రాలను అనుసంధానం చేస్తూ భూగర్భ జలాలపై యాప్ రూపొందించిన అమెరికాలోని పృథ్వీ అనే యువకుడిని సీఎం అభినందించారు.

## శాప్ ద్వారా క్రీడా క్యాలెండర్..

విద్యుత్ సరఫరా నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, రాష్ట్రంలో ఇసుక లభ్యత, ధరలు, సరఫరాపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సీఎం ఆదేశించారు. 'శాప్' ఆధ్వర్యంలో ఏడాది పొడవునా క్రీడా క్యాలెండర్‌ను రూపొందించాలని, పట్టణాలకే పరిమితం కాకుండా గ్రామస్థాయిలోనూ క్రీడా పోటీలు నిర్వహించాలని సూచించారు. నోడల్ అధికారుల ఆధ్వర్యంలో 175 నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరును మెరుగుపరిచేలా స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని ఆదేశించారు.

# వేగమే ఏపీ ప్రభుత్వ కల్చర్!

- పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ ప్రత్యేక శైలి
- ఎంఓయూలు కాదు.. ప్రాజెక్టుల గ్రౌండింగే లక్ష్యం
- వ్యవసాయం నుంచి తయారీ రంగం వరకు సర్వత్రా అభివృద్ధి
- ఫైర్‌సైడ్ చాట్‌లో దార్శనికతను వివరించిన నారా లోకేష్



**న్యూఢిల్లీ (సమయం న్యూస్):** స్థిరమైన ప్రభుత్వంతోనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని, అగ్రికల్చర్ నుంచి మ్యానుఫ్యాక్చరింగ్ వరకు స్పీడ్ ఏపీ కల్చర్‌గా మారిందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. స్పీడ్ ఈజ్ మనీ.. టైమ్ ఈజ్ మనీ అనేది తమ నినాదమని స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో పబ్లిక్ అఫైర్స్ ఫోరమ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 'స్వర్ణాంధ్రఏ2047' అంశంపై నిర్వహించిన 'ఫైర్‌సైడ్ చాట్' కార్యక్రమంలో మంత్రి లోకేష్ పాల్గొని, రాష్ట్ర భవిష్యత్ దార్శనికతను వివరించారు.

## స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో మేమే టాప్..

పెట్టుబడులను ఆకర్షించడంలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' ఏపీ ప్రత్యేకత అని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. పొరుగు రాష్ట్రాల్లో దశాబ్దానికి పైగా నిలిచిపోయిన ప్రాజెక్టులను ఏపీలో 18 నెలల్లోపే గ్రౌండింగ్ చేయగలిగామన్నారు. 13 నెలల్లోనే విశాఖకు గూగుల్ డేటా సెంటర్‌ను తీసుకొచ్చినట్లు గుర్తుచేశారు. "ఫైళ్లను ఎంత వేగంగా పరిష్కరిస్తున్నారనే అంశంపై మంత్రివర్గ సమావేశంలో చర్చ జరుగుతుంది. దీనిపై మంత్రులకు ర్యాంకులు కూడా ఇస్తాం. బ్యూరోక్రసీ స్థాయిలో కూడా ఇదే వేగం ఉంటుంది" అని మంత్రి వివరించారు. పౌరులకు వేగంగా సేవలందించేందుకు 'మనమిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 1000 కి పైగా సేవలను అందిస్తున్నామన్నారు.

## 23 క్లస్టర్ల అభివృద్ధి.. అక్టోబర్ 2 న హార్టికల్చర్ మిషన్..

రాష్ట్రంలో ఏఐ, స్పేస్, డ్రోన్లు, సిమెంట్, మెడికల్ డివైసెస్, ఫార్మా, డేటా నుంచి హార్టికల్చర్, ఆక్వా రంగాల వరకు 23 ప్రత్యేక క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి లోకేష్ తెలిపారు. వర్టికల్, హారిజాంటల్ విధానాలతో వీటిని ముందుకు తీసుకెళ్తున్నట్లు చెప్పారు. స్కైరూట్ కంపెనీకి 300 ఎకరాలు ఇచ్చి ప్రోత్సహించామని, సాగర్ డిఫెన్స్ కంపెనీని ఆదరించామని, ఆర్సెలర్ మిట్టల్ ప్రాజెక్టుకు కేవలం 18 నెలల్లోనే పర్యావరణ అనుమతులు సహా అన్నీ పూర్తి చేశామని ఉదాహరణలతో వివరించారు. అక్టోబర్ 2 న హార్టికల్చర్ మిషన్‌ను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఎంఓయూల కంటే ప్రాజెక్టుల గ్రౌండింగ్‌కే తాము ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని, 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఏపీని తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

# విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడాలి

- అధికారులకు మంత్రి సవిత కీలక ఆదేశాలు
- భారీ వర్షాల నేపథ్యంలో గురుకులాలు, హాస్టళ్లపై అలర్ట్
- వ్యాధులు ప్రబలకుండా ముందుస్తు వైద్య శిబిరాలు
- విద్యార్థులకు కాచి, చల్లార్చిన నీరు.. వేడి ఆహారం
- శిథిలావస్థలో ఉన్న భవనాల నుంచి విద్యార్థుల తరలింపు



**అమరావతి (సమయం న్యూస్):** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో బీసీ సంక్షేమ శాఖ అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, బీసీ హాస్టళ్లు, గురుకులాల్లో చదువుకునే విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకోవాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత ఆదేశించారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్. సత్యనారాయణ, పలువురు కార్పొరేషన్ల చైర్మన్లతో మంత్రి గురువారం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.

## వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు..

భారీ వర్షాలతో వ్యాధులు ప్రబలకుండా హాస్టళ్లు, గురుకులాల పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని మంత్రి ఆదేశించారు. బీసీ హాస్టళ్లు, గురుకులాల సిబ్బంది నిత్యం విద్యార్థులకు అందుబాటులో ఉంటూ, వారి యోగక్షేమాలను పర్యవేక్షించాలన్నారు. విద్యార్థులకు కేవలం వేడి, తాజా ఆహారం మాత్రమే అందించాలని, కాచి చల్లార్చిన నీటినే ఇవ్వాలని స్పష్టం చేశారు. బయట ఆహారాన్ని హాస్టళ్లలోకి రానివ్వొద్దని ఆదేశించారు. వ్యాధులు ప్రబలక ముందే ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని, ఎవరైనా విద్యార్థులు అస్వస్థతకు గురైతే వెంటనే సమీప ఆసుపత్రులకు తరలించి మెరుగైన వైద్యం అందించాలని మంత్రి సవిత సూచించారు. పాత భవనాల్లో ఉన్న విద్యార్థులను తక్షణమే సురక్షిత భవనాల్లోకి తరలించాలన్నారు.

## స్థానిక ఎన్నికలకు సమాయత్తం..

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని బీసీ కార్పొరేషన్ చైర్మన్లకు మంత్రి సవిత దిశానిర్దేశం చేశారు. కూటమిలోని పార్టీలు, నాయకులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2 ఏళ్ల పాలనలో బీసీల అభివృద్ధి కోసం అమలు చేసిన పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని మంత్రి ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో బీసీ కార్పొరేషన్ చైర్మన్లు వీరంకి వెంకట గురుమూర్తి, పేరేపి ఈశ్వర్, మల్లెల ఈశ్వర్, వెంకటరమణ, యాటగిరి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సమరానికి సిద్ధం కావాలి!

- కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి
- సమిష్టి కృషితోనే పార్టీ విజయపథంలోకి పయనం
- రీజినల్ కోఆర్డినేటర్లకు వైఎస్ జగన్ దిశానిర్దేశం
- బలమైన అభ్యర్థులను ముందుగానే గుర్తించాలని ఆదేశం
- అధికార దుర్వినియోగాన్ని దీటుగా ఎదుర్కోవాలని పిలుపు



**తాడేపల్లి (సమయం న్యూస్):** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీని సన్నద్ధం చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పార్టీ రీజినల్ కోఆర్డినేటర్లను ఆదేశించారు. తాడేపల్లిలో నిర్వహించిన కీలక సమావేశంలో ఆయన స్థానిక ఎన్నికల సన్నద్ధతపై సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. బలమైన అభ్యర్థులను ముందుగానే గుర్తించి, అందరి సమన్వయంతో పార్టీ ముందుకు సాగేలా చూడాలని దిశానిర్దేశం చేశారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని, ప్రజల్లో విశ్వసనీయత కలిగిన, సమర్థులైన వారిని బరిలోకి దించాలని జగన్ సూచించారు. ఈ ఎంపికలు భవిష్యత్ ఎన్నికల్లోనూ పార్టీకి బలం చేకూర్చేలా ఉండాలని స్పష్టం చేశారు. అన్ని స్థాయిల్లోని నాయకులతో మాట్లాడి, వారి అభిప్రాయాలను సేకరించిన తర్వాతే జాబితాలను ఖరారు చేయాలని తెలిపారు. పార్టీ యంత్రాంగాన్ని 1 వేదికపైకి తీసుకువచ్చి, ఎన్నికల్లో సమిష్టిగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. స్థానిక నాయకత్వాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ, బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలన్నారు.

### ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి..

పార్టీ విధానాలను నేరుగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని రీజినల్ కోఆర్డినేటర్లను జగన్ కోరారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడాలను ప్రజలకు వివరించాలన్నారు. చంద్రబాబు నాయుడు పాలనలో 2.5 ఏళ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, నష్టాల గురించి తెలియజేయాలని సూచించారు. గతంలో అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలని, ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైన అంశాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించారు.

### సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి..

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎదురయ్యే సవాళ్లకు పార్టీ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని జగన్ హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసేందుకు చంద్రబాబు నాయుడు పోలీసుల అధికారాన్ని, ఇతర మార్గాలను ఉపయోగించే ప్రయత్నం చేస్తారని ఆరోపించారు. అందుకు అనుగుణంగా ప్రతి స్థాయిలో ప్రత్యామ్నాయాలు, అత్యవసర కార్యాచరణ ప్రణాళికలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు బొత్స సత్యనారాయణ, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వై.వి. సుబ్బారెడ్డి, అయోధ్య రామిరెడ్డి, పి.వి. మిధున్ రెడ్డి, కురసాల కన్నబాబు, గుడివాడ అమర్‌నాథ్, బూడి ముత్యాల నాయుడు పాల్గొన్నారు.



# గాల్లో చక్కర్లు.. టెన్షన్!

### తుఫాను ప్రభావంతో పనిచేయని సిగ్నల్స్
### భోగాపురంలో దిగాల్సిన విమానం నాగపూర్‌కు మళ్లింపు
### విమానంలో మంత్రులు అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్
### ప్రయాణికుల్లో మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ

**విజయనగరం (సమయం న్యూస్):** తీవ్ర తుఫాను ప్రభావం, సిగ్నల్స్ పనిచేయకపోవడంతో ఏపీ మంత్రులు, ప్రముఖులు ప్రయాణిస్తున్న విమానం భోగాపురంలో ల్యాండ్ కాలేకపోయింది. దీంతో విమానాన్ని పైలట్లు మహారాష్ట్రలోని నాగపూర్‌కు దారి మళ్లించారు. ఈ పరిణామంతో సుమారు 2 గంటల పాటు ప్రయాణికులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఉత్కంఠకు, భయాందోళనలకు గురయ్యారు. బుధవారం రాత్రి 8:35 గంటలకు విజయవాడ నుంచి బయలుదేరిన ఎయిర్ ఇండియా ఐఎక్స్ 1373 విమానం భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో రాత్రి 9:40 గంటలకు దిగాల్సి ఉంది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా గత 4 రోజులుగా ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాత్రి 9:40 గంటల సమయానికి భోగాపురం చేరుకున్నప్పటికీ, వాతావరణం ఏమాత్రం అనుకూలించకపోవడం, సిగ్నల్స్ అందకపోవడంతో విమానం 20 నిమిషాల పాటు గాలిలోనే చక్కర్లు కొట్టింది. రన్‌వేపై ల్యాండ్ చేసే అవకాశం లేకపోవడంతో అధికారులు వెంటనే విమానాన్ని నాగపూర్ వైపు మళ్లించారు.

### విమానంలో మంత్రులు, బొత్స..

ఈ విమానంలో విజయవాడలో కేబినెట్ భేటీ ముగించుకుని మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్‌లతో పాటు దాదాపు 70 మంది ప్రయాణికులు ఉన్నారు. శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, ఆయన కుమార్తె కూడా ఇదే విమానంలో ప్రయాణిస్తున్నారు. భోగాపురంలో విమానం దిగకపోవడం, మరోవైపు 2 గంటలకు పైగా ఏం జరుగుతుందో తెలియకపోవడంతో ఎయిర్‌పోర్టుకు వచ్చిన మంత్రుల సిబ్బంది, ప్రయాణికుల బంధువులు తీవ్ర ఆందోళన చెందారు. విమానం నాగపూర్‌లో సురక్షితంగా ల్యాండ్ కావడంతో ప్రయాణికులు, నేతలు, వారి కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం గురువారం తెల్లవారుజామున 2:40 గంటలకు నాగపూర్ నుంచి బెంగళూరు మీదుగా బయలుదేరిన విమానం ఎట్టకేలకు భోగాపురం చేరుకుంది. ఈ విమానంలో మంత్రి అచ్చెన్నాయుడు భోగాపురం చేరుకోగా, మరో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సచివాలయంలో కీలక సమావేశాలు ఉన్న కారణంగా బెంగళూరు నుంచి విజయవాడకు చేరుకున్నారు.



# మరో 807 మద్యం దుకాణాలకు నోటిఫికేషన్!

### రాష్ట్రంలో అమల్లోకి వచ్చిన నూతన ఎక్సైజ్ పాలసీ
### రెన్యువల్ చేసుకోని 414 షాపుల లైసెన్సుల రద్దు
### అక్టోబర్ 1 అర్ధరాత్రి వరకు దరఖాస్తుల స్వీకరణ
### అక్టోబర్ 3 న దరఖాస్తుల సమగ్ర పరిశీలన
### అక్టోబర్ 5 న లాటరీ ద్వారా పారదర్శకంగా కేటాయింపులు

**అమరావతి (సమయం న్యూస్):** రాష్ట్రంలో నూతన మద్యం విధానం అమల్లోకి వచ్చిన నేపథ్యంలో, ఖాళీగా ఉన్న 807 మద్యం దుకాణాల కేటాయింపునకు ప్రభుత్వం తాజా నోటిఫికేషన్ జారీ చేసింది. అక్టోబర్ 1 అర్ధరాత్రి వరకు ఈ దుకాణాలకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. అక్టోబర్ 3 వ తేదీన అధికారులు అందిన దరఖాస్తులన్నింటినీ సమగ్రంగా పరిశీలించి, అక్టోబర్ 5 న లాటరీ పద్ధతి ద్వారా అర్హులకు పారదర్శకంగా షాపులను కేటాయిస్తారు. అత్యంత వేగంగా, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ఈ ప్రక్రియను ముగించాలని ఎక్సైజ్ శాఖ నిర్ణయించింది.

### 414 లైసెన్సుల రద్దు..

గతంలో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,650 మద్యం షాపులకు ఎక్సైజ్ శాఖ రెన్యువల్ నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే, కేవలం 3,236 మద్యం షాపుల యజమానులు మాత్రమే తమ లైసెన్సులను రెన్యువల్ చేసుకున్నారు. మిగిలిన 414 షాపుల నిర్వాహకులు రెన్యువల్‌కు ముందుకు రాకపోవడంతో, నిబంధనల ప్రకారం ఆయా షాపుల లైసెన్సులను ప్రభుత్వం రద్దు చేసింది. ఈ 414 దుకాణాలతో పాటు, గతంలో దరఖాస్తులు రాక మిగిలిపోయిన ఇతర దుకాణాలను కూడా కలుపుకుని మొత్తం 807 మద్యం షాపుల కేటాయింపు కోసం ఈ కొత్త నోటిఫికేషన్‌ను ప్రభుత్వం జారీ చేసింది. మద్యం డిమాండ్, స్థానిక ప్రాంతాల ప్రాధాన్యత తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ షాపుల వివరాలను నోటిఫికేషన్‌లో పొందుపరిచారు.

# స్థానిక ఎన్నికలపై తీర్పు రిజర్వ్!

### ఏపీ హైకోర్టులో ముగిసిన కీలక విచారణ
### ఎస్ఐఆర్ పూర్తయ్యాకే ఎన్నికలు పెట్టాలన్న వైసీపీ
### వాదనలు వినిపించిన ప్రభుత్వం, ఎన్నికల సంఘం
### త్వరలోనే వెలువడనున్న ధర్మాసనం తుది నిర్ణయం
### తీర్పుపైనే ఆధారపడ్డ స్థానిక సమరం భవితవ్యం




**అమరావతి (సమయం న్యూస్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల భవిష్యత్తు, నిర్వహణ సమయంపై ఉత్కంఠ నెలకొంది. ఎన్నికల నిర్వహణపై దాఖలైన పలు పిటిషన్లపై ఏపీ హైకోర్టులో విచారణ ప్రక్రియ పూర్తయింది. పిటిషనర్లు, ప్రతివాదులతో పాటు ఎన్నికల కమిషన్ తరఫు న్యాయవాదులు వినిపించిన సుదీర్ఘ వాదనలను విన్న ధర్మాసనం తన తుది తీర్పును రిజర్వ్ చేసింది. త్వరలోనే వెలువడనున్న ఈ తీర్పు ఆధారంగానే ఎన్నికల నగారా ఎప్పుడు మోగుతుందనేది స్పష్టం కానుంది. రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ పూర్తయ్యేంత వరకు స్థానిక సంస్థల ఎన్నికలను నిలిపివేయాలని, వాయిదా వేయాలని కోరుతూ వైసీపీ తరఫున హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఓటర్ల జాబితా సవరణ, ఓట్ల తొలగింపు, కొత్త ఓట్ల చేర్పుల ప్రక్రియ అత్యంత పారదర్శకంగా పూర్తయిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోర్టులో బలంగా వాదించారు. అలా కాకుండా హడావుడిగా ఎన్నికలు నిర్వహిస్తే ఎంతోమంది అర్హులైన పౌరులు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు ఎన్నికల నిర్వహణ సాధ్యాసాధ్యాలు, ఓటర్ల జాబితాల రూపకల్పన ప్రక్రియల అమలుపై అటు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ), ఇటు రాష్ట్ర ప్రభుత్వం సైతం తమ వైఖరిని న్యాయస్థానానికి స్పష్టంగా వివరించాయి. అన్ని పక్షాలు దాఖలు చేసిన పిటిషన్లను, బీసీ రిజర్వేషన్ల కేటాయింపుతో పాటు ఇతర వివాదాస్పద అంశాలను సమగ్రంగా పరిశీలించిన హైకోర్టు ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించింది.

# లిక్కర్ స్కామ్ నిందితులకు బెయిల్!

### వాసుదేవరెడ్డి, రాజ్ కేసిరెడ్డిలకు ఊరట
### రూ. లక్ష పూచీకత్తుతో మంజూరు చేసిన ఈడీ కోర్టు
### దేశం విడిచి వెళ్లొద్దంటూ ఆంక్షలు
### పాస్‌పోర్టును తక్షణమే కోర్టులో సమర్పించాలని ఆదేశం

**అమరావతి (సమయం న్యూస్):** ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితులు రాజ్ కేసిరెడ్డి, వాసుదేవరెడ్డి, మరో 1 వ్యక్తికి ఈడీ కోర్టు బిగ్ రిలీఫ్ ఇచ్చింది. ఈ 3 గురికి షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేస్తూ ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. సుదీర్ఘ కాలంగా జరుగుతున్న ఈ కేసు విచారణలో ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం జడ్జి ఈ నిర్ణయం తీసుకున్నారు. విచారణ సందర్భంగా బెయిల్ కోరుతూ నిందితుల తరఫు న్యాయవాదులు తమ వాదనలు బలంగా వినిపించారు. ఈ కేసు విచారణకు రాజ్ కేసిరెడ్డి, వాసుదేవరెడ్డి మొదటి నుంచీ పూర్తిగా సహకరిస్తున్నారని కోర్టుకు తెలిపారు. విచారణ ప్రక్రియ దాదాపు ముగింపు దశకు చేరుకుందని, వీరికి బెయిల్ ఇస్తే దర్యాప్తుకు ఎలాంటి ఆటంకం కలగదని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈ వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం రూ. 1 లక్ష పూచీకత్తుతో బెయిల్ మంజూరుకు అంగీకరించింది. అదే సమయంలో కొన్ని కఠినమైన షరతులను సైతం విధించింది. నిందితులు కోర్టు ముందస్తు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లకూడదని స్పష్టం చేసింది. సాక్షులను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభావితం చేయకూడదని, పాస్‌పోర్టును వెంటనే కోర్టులో సమర్పించాలని ఆదేశించింది. దర్యాప్తు అధికారులు పిలిచినప్పుడు కచ్చితంగా విచారణకు హాజరుకావాలని నిబంధన పెట్టింది.

# అంబటి రాంబాబుకు ఈడీ నోటీసులు!

### ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో విచారణకు పిలుపు

**హైదరాబాద్ (సమయం న్యూస్):** ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు ఈడీ నోటీసులు జారీ చేసింది. హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10:30 గంటలకు జరిగే విచారణకు వ్యక్తిగతంగా హాజరుకావాలని అధికారులు ఆయనకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఈడీ నోటీసులపై అంబటి రాంబాబు స్పందిస్తూ తన ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దాదాపు 15 రోజుల క్రితమే తనకు గుండెకు స్టెంట్లు వేశారని, వైద్యుల సూచనల మేరకు ప్రస్తుతం పూర్తి విశ్రాంతి తీసుకుంటున్నానని సమాధానమిచ్చారు. అనారోగ్య కారణాల వల్ల ప్రస్తుతానికి విచారణకు హాజరుకాలేనని, పూర్తిగా కోలుకున్న తర్వాత తప్పనిసరిగా వచ్చి దర్యాప్తుకు పూర్తి సహకారం అందిస్తానని స్పష్టం చేశారు. అయితే అంబటి రాంబాబు చేసిన ఈ విజ్ఞప్తిపై ఈడీ అధికారులు ఇంకా తమ నిర్ణయాన్ని వెల్లడించాల్సి ఉంది. మరోవైపు ఇదే కేసులో ఈడీ అధికారులు దర్యాప్తును వేగవంతం చేశారు. గురువారం మద్రి సుబ్బారెడ్డి, రాయపాటి పురుషోత్తమరావుల వాంగ్మూలాలను అధికారులు రికార్డ్ చేశారు. మొదటి కాంట్రాక్టు కాలంలో వీరిద్దరూ కలిసి సుమారు 59.14 లక్షల మద్యం పెట్టెలను రవాణా చేసిన వ్యవహారంపై అధికారులు లోతుగా ఆరా తీస్తున్నట్లు సమాచారం. మద్యం రవాణాకు సంబంధించిన సబ్ కాంట్రాక్టులు, నిధుల మళ్లింపులతో పాటు మాజీ మంత్రి అంబటి రాంబాబుతో వీరికి ఉన్న సంబంధాలపై అధికారులు కీలక ప్రశ్నలు సంధించినట్లు తెలుస్తోంది.

# గాళ్ల సుబ్రమణ్యానికి ఘన నివాళులు!



- విజయవాడ మహాప్రస్థానంలో ముగిసిన అంత్యక్రియలు
- కన్నీటిపర్యంతమైన పాండురంగయ్య నాయుడు

**విజయవాడ (సమయం న్యూస్):** కాపునాడు జాతీయ అధ్యక్షుడు గాళ్ల సుబ్రమణ్యం మృతితో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కాపు, బలిజ సామాజిక వర్గాల ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. గురువారం విజయవాడ నగరంలోని మహాప్రస్థానంలో ఆయన పార్థివ దేహానికి అంత్యక్రియలు నిర్వహించి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. తమ అభిమాన నాయకుణ్ణి కడసారి చూసి గ్రేటర్ రాయలసీమ కాపునాడు కోఆర్డినేటర్ పూల పాండురంగయ్య నాయుడు కన్నీటి పర్యంతమయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా నివసిస్తున్న కాపు, బలిజ కుటుంబ సభ్యులకు ఆయన మృతి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాపు సంఘ నేతగా సుబ్రమణ్యం సుదీర్ఘకాలం పాటు విజయవాడలో నివాసం ఉంటూ, దివంగత ఎమ్మెల్యే వంగవీటి మోహన రంగారావుకు అత్యంత సన్నిహితంగా మెలిగారు. 2024 లో ఉమ్మడి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి కోస్తా జిల్లాలతో పాటు గ్రేటర్ రాయలసీమ ప్రాంతంలో ఉన్న కాపు, బలిజల మధ్య ఐకమత్యాన్ని తీసుకొచ్చేందుకు ఆయన ఎంతో కృషి చేశారని పూల పాండురంగయ్య నాయుడు కొనియాడారు.

రాష్ట్ర కాపునాడు వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత మిరియాల వెంకట్రావు, వంగవీటి రంగా, ముద్రగడ పద్మనాభం తర్వాత కాపు సంఘంలో స్వర్గీయ గాళ్ల సుబ్రమణ్యం ప్రత్యేక గుర్తింపు పొందారని ఆయన తెలిపారు. భవిష్యత్ కాలంలో కాపు, బలిజల ఐక్యత కోసం సుబ్రమణ్యం ఆశయాలను కొనసాగిస్తామని పాండురంగయ్య నాయుడు స్పష్టం చేశారు. మృతదేహాన్ని సందర్శించి ఆయన కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపిన వారిలో శ్రీ సత్యసాయి జిల్లా బలిజ సంఘం అధ్యక్షుడు ఇటికంటి మహేష్, అనంతపురం జిల్లా బలిజ సంఘం సీనియర్ నేత రాయల్ మురళి, ప్రకాశం జిల్లా కాపునాడు నాయకులు పోగుల మల్లి, దాసరి పిచ్చయ్యతో పాటు అనేక మంది ప్రజాప్రతినిధులు, మాజీ నేతలు, శ్రేయోభిలాషులు ఉన్నారు.

## సంపాదకీయం



# ఈసీ పారదర్శకతపై ప్రశ్నలు!?

భారత ప్రజాస్వామ్యానికి ఎన్నికలు ప్రాణాధారం. ఎన్నికల్లో ఎవరు గెలిచారు, ఎవరు ఓడిపోయారు అన్నది అంతిమంగా ప్రజల నిర్ణయం. అయితే ఆ నిర్ణయం స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా వెలువడిందన్న నమ్మకం ప్రజల్లో ఉండటం అంతకంటే ముఖ్యం. ఆ నమ్మకాన్ని కాపాడే అత్యంత కీలక రాజ్యాంగ సంస్థ ఎన్నికల సంఘం. అలాంటి సంస్థలోనే నిర్ణయాల ప్రక్రియపై అంతర్గత అభ్యంతరాలు వ్యక్తమైనట్లు వచ్చిన తాజా కథనాలు సహజంగానే ఆందోళన కలిగిస్తున్నాయి. ఇండియన్ ఎక్స్ ప్రెస్ పరిశోధన ప్రకారం ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో ఓటర్ల జాబితాలు, కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల పేర్ల తొలగింపు, ఫారం-6లో మార్పులు, ఎన్నికల డేటా నిర్వహణ వంటి అంశాలపై అభ్యంతరాలు నమోదు చేశారు. కొన్ని సందర్భాల్లో తమకు తెలియకుండానే నిర్ణయాలు తీసుకున్నట్లు వారు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు ఆ కథనం పేర్కొంది. అయితే ఈ పరిణామాలపై ఎన్నికల సంఘం వివరణ కూడా ఇచ్చింది. కమిషనర్ల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడం సాధారణ ప్రక్రియలో భాగమేనని, అవి తుది నిర్ణయాలకు ముందు జరిగే అంతర్గత చర్చలేనని ఈసీ చెబుతోంది. గత ఏడాది తీసుకున్న నిర్ణయాలన్నీ పూర్తి కమిషన్ ఏకగ్రీవంగా ఆమోదించినవేనని స్పష్టం చేసింది. ఇక్కడ అసలు ప్రశ్న ఎవరి వాదన నిజమన్నది మాత్రమే కాదు. ఎన్నికల సంఘం నిర్ణయాలు ఎలా తీసుకుంటుంది? ఆ ప్రక్రియ ఎంత పారదర్శకంగా ఉంది? అన్నదే. ఓటర్ల జాబితా విషయంలో ఈ ప్రశ్న మరింత ప్రాధాన్యం సంతరించుకుంటుంది. ఓటు హక్కు ఉన్న వ్యక్తి పేరు జాబితాలో లేకపోతే అతని ప్రజాస్వామ్య హక్కు ఆచరణలో అర్థరహితమవుతుంది. అదే సమయంలో అర్హత లేని పేర్లు జాబితాలో ఉండకుండా చూడటం కూడా ఎన్నికల సంఘం బాధ్యతే. అందుకే పేర్ల తొలగింపు, చేర్పు ప్రక్రియకు స్పష్టమైన ప్రమాణాలు, సమయానుకూల సమాచారం, అప్పీల్‌కు సులభమైన అవకాశం ఉండాలి. పశ్చిమ బెంగాల్‌లో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ సందర్భంగా తొలగించిన 27.16 లక్షల మంది ఓటర్లలో 22 లక్షలకు పైగా పునరుద్ధరణ కోసం అప్పీలు చేసుకున్నట్లు ఎన్నికల సంఘం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఇది ఒక్కటే ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ఎంత సున్నితమైనదో చెప్పడానికి సరిపోతుంది. ఇక సాంకేతిక వ్యవస్థల పాత్ర పెరుగుతున్న కొద్దీ మరో ప్రశ్న ముందుకొస్తోంది. ఓటర్ల డేటా, నమోదు, తొలగింపు వంటి కీలక ప్రక్రియల్లో సాఫ్ట్ వేర్ ఆధారిత నిర్ణయాలు పెరిగితే వాటిపై స్వతంత్ర తనిఖీ ఎలా ఉంటుంది? ఏ అధికారి ఏ నిర్ణయం తీసుకున్నారో, ఎందుకు తీసుకున్నారో భవిష్యత్తులో ఆడిట్ చేయగలిగే రికార్డు ఉంటుందా? ఓటరుకు తన పేరు ఎందుకు తొలగించబడిందో తెలుసుకునే హక్కు, దాన్ని సవాలు చేసే అవకాశం ఎంత సులభంగా ఉంటుంది?

### ఈ ప్రశ్నలకు సమాధానాలు ఉండాలి

ఎన్నికల అక్రమాల ఆరోపణలు వచ్చిన ప్రతిసారీ వాటిని రాజకీయ ఆరోపణలుగా కొట్టిపారేయడం కూడా సరైన మార్గం కాదు. అదే సమయంలో నిర్ధారణ కాని ఆరోపణలను వాస్తవాలుగా ప్రచారం చేయడం కూడా ప్రజాస్వామ్యానికి మేలు చేయదు. ఆరోపణ ఏదైనా సరే, దానికి సంబంధించిన డేటా, పత్రాలు, ప్రక్రియలను పరిశీలించి నిజానిజాలు తేల్చే వ్యవస్థ బలంగా ఉండాలి. ఎన్నికల సంఘం మీద విమర్శలు రావడం ప్రజాస్వామ్యానికి ప్రమాదం కాదు. విమర్శలకు సమాధానం చెప్పే పారదర్శక వ్యవస్థ లేకపోవడమే ప్రమాదం. కమిషనర్ల మధ్య భిన్నాభిప్రాయాలు ఉంటే వాటిని సంస్థాగత చర్చలోనే పరిష్కరించుకోవచ్చు. కానీ ఓటర్ల హక్కులకు సంబంధించిన అంశాల్లో ఆ చర్చలకు సంబంధించిన విధానం, నిర్ణయానికి వచ్చిన కారణాలు, బాధ్యత వహించిన వ్యవస్థ ప్రజలకు అర్థమయ్యేలా ఉండాలి. అంతర్గత అభ్యంతరాలు నిజంగా సాధారణ ప్రక్రియలో భాగమే అయితే, వాటిని దాచాల్సిన అవసరం కూడా ఉండదు. అవి నిర్ణయ ప్రక్రియను మరింత మెరుగుపరిచేలా ఉపయోగపడాలి. భారత ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం ఉండటం ఎన్నికల సంఘానికి మాత్రమే అవసరం కాదు. అధికార పక్షానికి, ప్రతిపక్షానికి, అభ్యర్థులకు, ఓటర్లకు సమానంగా అవసరం. ఎన్నికల్లో ఓడిపోయిన పార్టీ కూడా ఫలితాన్ని అంగీకరించగలగాలి. గెలిచిన పార్టీ కూడా ఆ విజయం ప్రజల స్వేచ్ఛాయుత తీర్పు వల్లే వచ్చిందన్న నమ్మకంతో ఉండాలి. అందుకే ఎన్నికల సంఘంపై ప్రస్తుతం తలెత్తిన ప్రశ్నలను రాజకీయ పోరాటానికి మాత్రమే పరిమితం చేయకుండా సంస్థాగత సంస్కరణలకు అవకాశంగా చూడాలి. ఓటర్ల జాబితాల సవరణకు మరింత పారదర్శక విధానం, డిజిటల్ వ్యవస్థల స్వతంత్ర ఆడిట్, నిర్ణయాలపై స్పష్టమైన రికార్డింగ్, ఫిర్యాదుల పరిష్కారానికి వేగవంతమైన వ్యవస్థ, అవసరమైన చోట న్యాయపరమైన పర్యవేక్షణ వంటి చర్యలు ప్రజల విశ్వాసాన్ని బలోపేతం చేయగలవు. ఎన్నికల సంఘం మీద విశ్వాసం అంటే ఒక వ్యక్తి మీద లేదా ఒక కమిషనర్ మీద విశ్వాసం కాదు. అది భారత ఎన్నికల ప్రక్రియ మీద విశ్వాసం. ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదే. అలాగే ఎన్నికల అక్రమాలపై ఆరోపణలు చేసే రాజకీయ పక్షాలు కూడా ఆధారాలతో మాట్లాడాల్సిన బాధ్యతను గుర్తించాలి. ప్రజాస్వామ్యంలో తుది అధికారం ఓటరుదే. ఆ ఓటు ఎవరిది, అది ఎలా నమోదైంది, ఎందుకు తిరస్కరించబడింది, ఎన్నికల ఫలితం ఎలా వచ్చింది అన్న ప్రతి దశపై ప్రజలకు నమ్మకం ఉన్నప్పుడే ఆ తీర్పుకు పూర్తి విలువ ఉంటుంది. ఎన్నికలు నిర్వహించడం మాత్రమే ఎన్నికల సంఘం బాధ్యత కాదు. ఎన్నికలపై ప్రజల విశ్వాసాన్ని కాపాడటమే దాని అసలు పరీక్ష.

# ‘ఓటు చోరీ’తో గెలిస్తే.. ఆ చట్టాలూ చెల్లవు!

- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలి
- సీఈసీ అప్రూవర్‌గా మారడం దేశ ప్రయోజనాలకు మంచిది
- ఢిల్లీ మీడియా సమావేశంలో ధ్వజమెత్తిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24 (సమయం న్యూస్):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై కేంద్ర ఎన్నికల సంఘంలో తీవ్ర విభేదాలు, అభ్యంతరాలు వ్యక్తమైనట్లు కథనాలు వెలువడటంతో లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ‘ఓటు చోరీ’ ద్వారా అక్రమంగా ఎంపీలుగా గెలిచిన వారు పార్లమెంట్‌లో చేసే చట్టాలకు చెల్లుబాటు ఉండదని స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల తొలగింపు, అక్రమాలు జరిగాయని కాంగ్రెస్ పార్టీ బహిరంగంగా లేవనెత్తిన తర్వాతే, కమిషన్‌లోని ఇద్దరు ఎన్నికల కమిషనర్లు (సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి) ఓటర్ల జాబితాల సవరణపై సీఈసీకి తమ తీవ్ర అభ్యంతరాలను తెలిపారని గుర్తుచేశారు. ఈ మొత్తం వ్యవహారంపై జ్ఞానేశ్ కుమార్ అప్రూవర్‌గా మారి నిజాలు వెల్లడించడం దేశ ప్రజాస్వామ్య ప్రయోజనాలకు ఎంతో మంచిదని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

### మోదీ, అమిత్‌షా బాధ్యత వహించాలి

ఎంతటి బలమైన నాయకులైనా కొన్నేళ్ల పాలన తర్వాత వారిపై ప్రజా వ్యతిరేకత రావడం సైజమని, అయితే ఆ ప్రజా ఆగ్రహం నుంచి తప్పించుకునేందుకు బీజేపీ ప్రభుత్వం ‘ఓటు చోరీ’ వంటి అక్రమ మార్గాలను ఎంచుకుంటోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రస్తుత సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ద్వయమే ఎంపిక చేసిందని ప్రస్తావించారు. కమిషన్‌లో నెలకొన్న ప్రస్తుత గందరగోళానికి, అవసవ్యతలకు సీఈసీయే కారణమని ఇద్దరు కమిషనర్లు స్పష్టం చేస్తున్నందున, ఆయనను ఎంపిక చేసిన ప్రధాని, హోంమంత్రులే దీనికి పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

# ఆ వినాశకర సాఫ్ట్‌వేర్‌ను వెంటనే రద్దు చేయాలి

- దేశ ప్రజలకు ఈసీ క్షమాపణ చెప్పాలి
- కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ డిమాండ్
- ఢిల్లీ కేంద్రంగా నియంత్రిస్తున్న ‘ECINet App’ పై తీవ్ర దుమారం



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24 (సమయం న్యూస్):** ఎన్నికల సంఘం ఉపయోగిస్తున్న సాఫ్ట్‌వేర్ వివాదాస్పదంగా మారిందని, పౌరుల రాజ్యాంగ హక్కులను హరించే ఈ వినాశకరమైన సాఫ్ట్‌వేర్‌ను వెంటనే రద్దు చేయాలని కాంగ్రెస్ సీనియర్ ఎంపీ శశిథరూర్ తీవ్రస్థాయిలో పిలుపునిచ్చారు. ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు వంటి కీలక ప్రక్రియలను ఎన్నికల కమిషనర్లకు తెలియకుండానే చేపడుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో గోవాలో వెలుగుచూసిన పరిణామాలు ఇప్పుడు దేశవ్యాప్తంగా రాజకీయ దుమారాన్ని రేపుతున్నాయి. ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) సందర్భంగా గోవాలో కొందరు ఓటర్ల వివరాల్లో సాంకేతిక వైరుధ్యాలను డేటాబేస్ గుర్తించింది. అయితే, క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఓటరు నమోదు అధికారులు అందులోని 97 మంది పౌరులు ఓటరు జాబితాలో ఉండటానికి సంపూర్ణ అర్హులని నిర్ధారించారు. కానీ, వారి పేర్లను పునరుద్ధరించేందుకు స్థానిక అధికారులకు యాప్‌లో ఎలాంటి ఆప్షన్ అందుబాటులో లేకుండా చేశారు. దీనిపై గోవా ప్రధాన ఎన్నికల అధికారి ఏడు రోజుల వ్యవధిలో ఏకంగా 8 సార్లు ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖలు రాసినప్పటికీ, అక్కడి నుంచి ఎలాంటి అనుమతి లభించలేదు. ఫలితంగా అర్హులైన 97 మంది పౌరులు ఓటరు జాబితా నుంచి వైదొలగాల్సి వచ్చింది.

### ఓటు హక్కుతో పాటు వైద్యానికీ దూరం:

ఈ వ్యవహారంపై ఎంపీ శశిథరూర్ తన ‘ఎక్స్’ (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. “గోవాలో ఓటరు జాబితాలో పేరు లేకపోవడం అంటే కేవలం ఓటు హక్కును కోల్పోవడమే కాదు.. సూపర్ స్పెషాలిటీ చికిత్సలు, డయాలసిస్, అవయవ మార్పిడి వంటి అత్యవసర సేవలను అందించే ప్రభుత్వ మెడిక్లెయిమ్ పథకాల ప్రయోజనాల నుంచి కూడా పౌరులను దూరం చేయడమే” అని మండిపడ్డారు. రాజకీయ కుతంత్రాలే దారుణమనుకుంటే, పౌరుల ప్రాథమిక హక్కులను, ఆరోగ్య భద్రతను హరించే ఇలాంటి అమానవీయ ప్రవర్తనను ఎంతమాత్రం సహించలేమని ఆయన స్పష్టం చేశారు. ఈ దారుణ తప్పిదానికి గాను కేంద్ర ఎన్నికల సంఘం దేశ ప్రజలకు, బాధితులకు తక్షణమే క్షమాపణ చెప్పాలని, డిజిటల్ వ్యవస్థ పేరుతో కలిగించిన నష్టాన్ని తక్షణమే సరిదిద్దాలని డిమాండ్ చేశారు.

# 48 గంటల్లో రాజీనామా చేయాలి

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు కాక్రోచ్ జనతా పార్టీ అల్టిమేటం
- లేకుంటే దేశవ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరిక
- రాజీనామా చేసే వరకు వెనక్కి తగ్గేది లేదన్న అభిజీత్ దీప్కే



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24 (సమయం న్యూస్):** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ 48 గంటల్లోగా పదవికి రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్ చేసింది. నిర్ణీత గడువులోగా ఆయన పదవి నుంచి తప్పుకోకపోతే దేశవ్యాప్తంగా ఆందోళన ప్రారంభిస్తామని ఆ పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే హెచ్చరించారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు తమ పోరాటం ఆగదని గురువారం ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రకటించారు. “48 గంటల్లో జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయకపోతే కాక్రోచ్ జనతా పార్టీ దేశవ్యాప్త ఆందోళన ప్రారంభిస్తుంది. ఆయన రాజీనామా చేసే వరకు వెనక్కి తగ్గేది లేదు” అని దీప్కే ప్రకటించారు. స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికల నిర్వహణ కోసం సీఈసీ పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. జ్ఞానేశ్ కుమార్‌పై దీప్కే తీవ్ర పదజాలంతో విమర్శలు చేశారు. ఆయనను ‘జాతి వ్యతిరేకి’గా అభివర్ణించడంతోపాటు భారత ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారారని ఆరోపించారు. ఇవి దీప్కే చేసిన రాజకీయ ఆరోపణలే తప్ప నిర్ధారిత వాస్తవాలు కావు. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల్లో ఓటర్ల జాబితాల సవరణకు సంబంధించిన వివిధ అంశాలపై కనీసం 14 సందర్భాల్లో అభ్యంతరాలు, సూచనలు నమోదు చేసినట్లు వచ్చిన మీడియా కథనాలను దీప్కే ప్రస్తావించారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఎన్నికల సంఘం నిర్ణయాలపై పారదర్శక విచారణ జరగాలని సీజేపీ డిమాండ్ చేస్తోంది. అయితే ఎన్నికల సంఘం ఈ వ్యవహారంపై భిన్నమైన వివరణ ఇచ్చింది. కమిషనర్ల మధ్య భిన్నమైన అభిప్రాయాలు, సూచనలు రావడం నిర్ణయ ప్రక్రియలో సహజమని, తుది నిర్ణయాలు పూర్తి కమిషన్ ఏకగ్రీవంగా తీసుకున్నవేనని పేర్కొంది.

### ‘13 కోట్ల ఓట్లు తొలగించారు’ అంటూ ఆరోపణ

దేశవ్యాప్తంగా 13 కోట్లకు పైగా ఓటర్ల పేర్లు తొలగించారని దీప్కే ఆరోపించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో అధికార, విపక్ష కూటముల మధ్య ఓట్ల తేడాను ప్రస్తావిస్తూ.. భారీ సంఖ్యలో ఓటర్ల పేర్ల తొలగింపు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపే అంశమని ఆయన వాదించారు. అయితే 13 కోట్ల ఓటర్ల తొలగింపుపై దీప్కే పేర్కొన్న సంఖ్యను ఆయన ఆరోపణగానే చూడాలి; అది అక్రమంగా తొలగించిన ఓట్ల సంఖ్యగా స్వతంత్రంగా నిర్ధారణ కాలేదు.

### మూడు ప్రధాన డిమాండ్లు

సీఈసీ రాజీనామాతోపాటు ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిలిపివేయడం, దానిపై స్వతంత్ర విచారణ జరిపించడం వంటి డిమాండ్లను సీజేపీ ముందుంచింది. ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన 2023 చట్టాన్ని మార్చి, ప్రజల్లో విశ్వాసం కలిగించే స్వతంత్ర ఎంపిక ప్రక్రియను తీసుకురావాలని కూడా కోరింది.

# అమెరికా, జపాన్‌లోనూ ఇలాంటివి జరుగుతాయి

### బాలికలపై వరుస వేధింపులపై బీహార్ మంత్రి అశోక్ చౌదరి




**పాట్నా, సెప్టెంబర్ 24 (సమయం న్యూస్):** బీహార్‌లోని జమూయి, సమస్తిపూర్, దర్భంగా జిల్లాల్లో వరుసగా బాలికలు, మహిళలపై లైంగిక వేధింపుల ఘటనలు వెలుగుచూడటంపై జేడీయూకి చెందిన బీహార్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి అశోక్ చౌదరి చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. భారతదేశం కంటే ఎంతో అభివృద్ధి చెందిన అమెరికా, జపాన్ వంటి అభివృద్ధి చెందిన దేశాల్లోనూ లైంగిక వేధింపులు, నేరాలు జరుగుతుంటాయని, ప్రభుత్వంపై ఉద్దేశపూర్వకంగా ప్రతికూల కథనాలు సృష్టించవద్దని ఆయన జర్నలిస్టులను హెచ్చరించారు. పాట్నాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీహార్‌లో మరువక ముందే జరుగుతున్న వరుస వేధింపుల ఘటనలపై విలేకరులు ప్రశ్నించగా మంత్రి ఘాటుగా స్పందించారు. “14 కోట్ల జనాభా ఉన్న బీహార్ రాష్ట్రంలో దుర్మార్గులు, చదువురానివారు, అజ్ఞానులు, అసభ్యంగా ప్రవర్తించేవారు, సంస్కారం లేనివారికి కొదవలేదు. వీరు చట్ట పాలనను దెబ్బతీస్తూ రాష్ట్రానికి చెడ్డపేరు తెస్తున్నారు. అయితే, నేరాలు ఎక్కడ జరగవు? మనకంటే అభివృద్ధి చెందిన అమెరికా, జపాన్లలోనూ ఇలాంటి ఘటనలు నిత్యం జరుగుతూనే ఉంటాయి” అని వ్యాఖ్యానించారు.

### ప్రభుత్వ చర్యలు, చట్ట బద్ధతపై వివరణ

ప్రభుత్వం నేరస్థులను కాపాడే ప్రయత్నం చేస్తోందా లేక చర్యలు తీసుకోవడంలో విఫలమవుతోందా అనేదే అసలైన ప్రశ్నని పేర్కొన్న మంత్రి, జమూయి ఘటనలో 24 గంటల్లోపు, సమస్తిపూర్‌లో 12 గంటల్లోపు పోలీసులు నిందితులను అరెస్టు చేశారని తెలిపారు. రేపటి నుంచి సమాజంలో ఇలాంటి ఘటనలు పూర్తిగా ఆగిపోతాయని ఏ ముఖ్యమంత్రినైనా, ప్రపంచ దేశాల నాయకుడైనా హామీ ఇవ్వలేరని స్పష్టం చేశారు. అయితే, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఆధ్వర్యంలో ఏదైనా నేరం జరిగితే, నిందితులపై చట్టం తన పూర్తి శక్తితో ఒక ‘బుల్డోజర్’లా విరుచుకుపడుతుందని, ఎవరినీ విడిచిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. మంత్రి వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు, మహిళా సంఘాలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నాయి. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, బాధ్యతారాహిత్యంగా సమాధానాలు ఇస్తూ విదేశాలతో పోల్చడం దారుణమని ఆక్షేపించాయి.



# ఎస్ఐఆర్‌ను వద్దంటే దేశద్రోహమే!

రాహుల్ గాంధీ వ్యాఖ్యలకు బీజేపీ ఘాటు కౌంటర్

కాంగ్రెస్ పతనానికి సోనియా, రాహులే కారణమన్న సుధాన్షు

ఓటర్ల సవరణపై సుప్రీంకోర్టు సంతృప్తి వ్యక్తం చేసిందని వెల్లడి

అస్సాం, బెంగాల్‌లో ఓట్ల తొలగింపుపై తప్పుడు ప్రచారం

ముస్లిం లీగ్ అండతోనే వయనాడ్‌లో గెలిచారని ఎద్దేవా

**న్యూఢిల్లీ (సమయం న్యూస్):** కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలకు భారతీయ జనతా పార్టీ గట్టి కౌంటర్ ఇచ్చింది. రాహుల్‌కు అసలు రాజకీయాలపై కనీస అవగాహన లేదని బీజేపీ నేత, రాజ్యసభ సభ్యుడు సుధాన్షు త్రివేది తీవ్రస్థాయిలో విమర్శించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ పతనానికి సోనియా గాంధీ, రాహుల్ గాంధీలే ప్రధాన కారణమని ఆయన ఆరోపించారు. కేంద్ర ఎన్నికల సంఘంలో కమిషనర్ల మధ్య విభేదాలు ఉన్నాయంటూ వస్తున్న వార్తలపై ఎన్నికల అధికారులు ఎవరూ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదని గుర్తుచేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిర్వహించే పూర్తి రాజ్యాంగబద్ధమైన అధికారం కేంద్ర ఎన్నికల సంఘానికి ఉందని సుధాన్షు స్పష్టం చేశారు. అటువంటి కీలకమైన ఎస్ఐఆర్ ప్రక్రియ వద్దని అడ్డుకోవాలని చూడటం దేశద్రోహానికి పాల్పడటంతో సమానమని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ఓటర్ల సవరణ ప్రక్రియపై ఇప్పటికే దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు పూర్తి సంతృప్తి వ్యక్తం చేసిందని తెలిపారు. ఈ ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు గానీ, అవకతవకలు గానీ జరిగినట్లు ఆధారాలు లేవన్నారు. అస్సాం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ద్వారా అర్హులైన ఓట్లను తొలగించారంటూ వాస్తవాలు తెలుసుకోకుండా రాహుల్ గాంధీ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

### సొంత రాష్ట్రంలో గెలిచే సత్తా లేదు..

రాహుల్ గాంధీతో పాటు ఆయన సోదరి ప్రియాంక గాంధీ వాద్రాకు సొంత రాష్ట్రంలో పోటీ చేసి గెలిచే దమ్ము లేదని సుధాన్షు త్రివేది ఎద్దేవా చేశారు. అందుకే కేరళలోని వయనాడ్ నియోజకవర్గానికి వెళ్లి, అక్కడ ముస్లిం లీగ్ పార్టీ మద్దతుతో ఆ 2 గురూ గెలిచారని విమర్శించారు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలోనే దేశంలో భారీ ఎత్తున రిగ్గింగ్‌లు, ఎన్నికల అక్రమాలు జరిగాయని ఆరోపించారు. కాగా, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను ఉద్దేశించి లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం, ఆర్ఎస్ఎస్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. ఎస్ఐఆర్ పేరిట సామాన్యుల ఓట్లను చోరీ చేస్తున్నారని, ఇది భారత రాజ్యాంగంపై జరుగుతున్న ప్రత్యక్ష దాడి అని రాహుల్ ఆరోపించిన నేపథ్యంలో బీజేపీ ఈ విధంగా దీటుగా స్పందించింది.

# 47 దేశాల పౌరులను రష్యా వాడుకుంటోంది!

ఐరాస సర్వప్రతినిధి సభలో జెలెన్‌స్కీ తీవ్ర ఆరోపణలు

భారత్ సహా పలు దేశాల ప్రజలను రిక్రూట్ చేసుకుంటున్న వైనం

యుద్ధరంగంలో మోసపోయి విదేశీయులు బలవుతున్నారు

పుతిన్ కుట్రలను, యుద్ధాన్ని అడ్డుకోవాలని ప్రపంచానికి పిలుపు

రష్యా సైన్యంలో 227 మంది భారతీయులు చేరినట్లు కేంద్రం ప్రకటన



**న్యూయార్క్ (సమయం న్యూస్):** భారత్ సహా 47 దేశాల ప్రజలను రష్యా తమపై సాగిస్తున్న యుద్ధంలో బలవంతంగా వాడుకుంటోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ సమావేశంలో ప్రసంగించిన ఆయన, ప్రపంచ దేశాలను యుద్ధంలోకి లాగాలని చూస్తున్న రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఆ అవకాశం ఇవ్వొద్దని ప్రపంచ నేతలను కోరారు. యుద్ధ రంగంలో పలు దేశాలకు చెందిన పౌరులు తమ బలగాలకు చిక్కుతున్నారని జెలెన్‌స్కీ తెలిపారు. భారత్, నేపాల్, యెమెన్, సుడాన్, దక్షిణాఫ్రికా లాంటి 47 దేశాల ప్రజలను రష్యా సైన్యం యుద్ధంలో ఉపయోగిస్తోందని చెప్పారు. రష్యన్లు కాని వారు కూడా ఈ యుద్ధంలో పెద్ద సంఖ్యలో ప్రాణాలు కోల్పోతుండటం తాము స్వయంగా చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ రకాల మోసాలు, కుట్రలతో ఇతర దేశాల పౌరులను రష్యాకు రప్పించి ఇబ్బందుల్లోకి నెడుతున్నారని మండిపడ్డారు. మీ దేశ పౌరులను యుద్ధ భూమిలో బలికాకుండా కాపాడుకోవాలని, పుతిన్ దూకుడుకు, యుద్ధ నిధులకు తక్షణమే బ్రేకులు వేయాలని ప్రపంచ దేశాలకు విజ్ఞప్తి చేశారు.

### భారతీయులపై విదేశాంగ శాఖ స్పష్టత..

ఉక్రెయిన్ యుద్ధంలో భారతీయులు పాల్గొంటున్న వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం అత్యున్నత స్థాయిలో రష్యాతో సంప్రదింపులు జరుపుతోందని గత నెలలో భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ స్పష్టం చేశారు. రష్యా ఆర్మీలో మొత్తం 227 మంది భారతీయులు చేరినట్లు తమ వద్ద అధికారిక సమాచారం ఉందని ఆయన పేర్కొన్నారు. వారిలో ఇప్పటికే 139 మంది ఆర్మీ నుంచి సురక్షితంగా బయటకు వచ్చారని, దురదృష్టవశాత్తూ 51 మంది ప్రాణాలు కోల్పోయారని కేంద్రం వెల్లడించింది.

# బాంబే ఐఐటీ విద్యార్థి ఆత్మహత్యపై నిరసనలు!

- ముంబై ఆజాద్ మైదాన్‌లో తల్లిదండ్రుల నిరాహార దీక్ష
- తమ బిడ్డను టార్చర్ పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు వినతిపత్రం అందజేత
- ఘటనపై అక్టోబర్ 10-11 కి వాయిదా పడిన మిడ్ సెమిస్టర్ పరీక్షలు
- బాధిత కుటుంబానికి అండగా ఉంటామని రాహుల్ గాంధీ హామీ



**ముంబై (సమయం న్యూస్):** ఇటీవల ఆత్మహత్య చేసుకున్న బాంబే ఐఐటీ విద్యార్థి సాహిల్ వాకోడే తల్లిదండ్రులు గురువారం ముంబైలో నిరాహార దీక్ష చేపట్టారు. తమ కుమారుడి మరణానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రవీంద్ర, సోనాలీ వాకోడే ఆజాద్ మైదాన్‌లో దీక్షకు దిగారు. ఈ ఘటనపై దర్యాప్తు వేగవంతం చేయాలంటూ జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు సైతం వినతి పత్రం అందజేశారు. 'మా బిడ్డను తీవ్రంగా టార్చర్ పెట్టిన వారు జైలుపాలు కావాలి. తాను కుల వివక్ష ఎదుర్కొన్నట్టు మా బిడ్డ గతంలోనే చెప్పాడు' అని తండ్రి రవీంద్ర ఆవేదన వ్యక్తం చేశారు.

బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న సాహిల్ (22) సెప్టెంబర్ 18 న తన హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సాహిల్ ఆత్మహత్యతో వివాదం రేగుతుండటంతో, సెప్టెంబర్ 26-27 తేదీల్లో జరగాల్సిన మిడ్ సెమిస్టర్ పరీక్షలను యాజమాన్యం అక్టోబర్ 10-11 తేదీలకు వాయిదా వేసింది. సాహిల్ ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులపై లోతైన దర్యాప్తు జరుగుతోందని బాంబే ఐఐటీ 'ఎక్స్' వేదికగా తెలిపింది. ఈ ఘటన కేసుకు సంబంధించి ప్రొఫెసర్ సూర్యనారాయణ పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. నిష్పాక్షిక దర్యాప్తు దిశగా ఆయనను సెలవుపై పంపించారు.

అయితే, ఈ పరిణామాలు రాజకీయ నిరసనలకు కూడా దారి తీశాయి. కాంగ్రెస్ ఎంపీ వర్ష గైక్వాడ్, పార్టీ కార్యకర్తలు, ఎన్ఎస్‌యూఐ నాయకులు ఐఐటీ బాంబేలో ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబానికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ గైక్వాడ్ సహా పలువురు నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇక కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా సాహిల్ తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడారు. న్యాయం కోసం వారు చేస్తున్న పోరాటంలో అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# స్లీపర్ బస్సులో మంటలు.. 9 మంది మృతి

- యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై ఘోర అగ్నిప్రమాదం!
- కిటికీల నుంచి దూకి ప్రాణాలు కాపాడుకున్న ప్రయాణికులు
- డ్రైవర్, క్లీనర్ నిర్లక్ష్యమే కారణమంటూ ఎఫ్ఐఆర్ నమోదు
- మీరు చనిపోయినా బస్సు ఆపనంటూ డ్రైవర్ దురుసు ప్రవర్తన
- మృతుల కుటుంబాలకు ప్రధాని మోదీ, సీఎం యోగి సంతాపం



**నోయిడా (సమయం న్యూస్):** ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడా పరిధి యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై గురువారం తెల్లవారుజామున అత్యంత ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ప్రయాణికులతో వెళ్తున్న ఓ ప్రైవేట్ స్లీపర్ బస్సులో ఒక్కసారిగా భారీగా మంటలు చెలరేగడంతో 9 మంది ప్రయాణికులు సజీవదహనమయ్యారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 30 నుంచి 35 మంది ప్రయాణికులు ఉన్నారని అధికారులు వెల్లడించారు. తెల్లవారుజాము సమయం కావడంతో ప్రయాణికులంతా గాఢ నిద్రలో ఉండగా ఈ విషాదం ముంచెత్తింది.

### కిటికీల నుంచి దూకిన ప్రయాణికులు..

ఢిల్లీలోని కాశ్మీర్ గేట్ నుంచి మహోబా వైపు వెళ్తున్న రాజ్ కల్పనా ట్రావెల్స్‌కు చెందిన బస్సు.. యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై జేవార్ ప్రాంతానికి చేరుకోగానే ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. క్షణాల్లో దట్టమైన పొగ బస్సు మొత్తాన్ని కమ్మేయడంతో లోపల ఉన్నవారికి బయటకు వెళ్లే దారి కనిపించలేదు. హాహాకారాలు చేస్తూ తోసుకుంటూ బయటకు వచ్చేందుకు కొందరు ప్రయత్నించగా, మరికొందరు కిటికీల అద్దాలు పగలగొట్టి కిందకు దూకి ప్రాణాలు దక్కించుకున్నారు. మృతుల్లో మహిళలు, చిన్నారులు, వృద్ధులు సైతం ఉన్నారు. గాయపడిన క్షతగాత్రులను వెంటనే సమీపంలోని ఆసుపత్రులకు తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు.

### ఎఫ్ఐఆర్‌లో డ్రైవర్ నిర్లక్ష్యం బట్టబయలు..

పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో బస్సు సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యంపై విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి. ప్రమాదానికి ముందు డ్రైవర్, క్లీనర్ ఇద్దరూ బస్సు లోపల సిగరెట్ తాగుతుండటాన్ని గమనించిన ప్రయాణికులు వారిని వారించారు. అయినా వినకుండా నవ్వుతూ ప్రయాణికులను సైలెంట్‌గా ఉండాలని బెదిరించినట్లు సమాచారం. బస్సు 33 కిలోమీటర్లు ప్రయాణించిన తర్వాత కాలిన వాసన వస్తోందని ప్రయాణికులు మొరపెట్టుకున్నా వాహనాన్ని ఆపలేదు. కాసేపటికే డ్రైవర్ సీటు వైపు నుంచి మంటలు చెలరేగాయి. ఆ సమయంలో ప్రయాణికులు భయంతో కేకలు వేయగా.. 'మీరు చనిపోయినా నాకు పర్వాలేదు, బస్సును మాత్రం ఆపను' అంటూ డ్రైవర్ దురుసుగా సమాధానమిచ్చినట్లు ఎఫ్ఐఆర్‌లో నమోదైంది.

### ప్రధాని మోదీ, సీఎం యోగి సంతాపం..

ఈ ఘోర ప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ఆర్థిక సాయం ప్రకటించారు. క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఈ ఘోర దుర్ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.


# శ్వేతసౌధంలోకి జర్నలిస్టులకు నో ఎంట్రీ!

- కోర్టు ఉత్తర్వులు ఇచ్చినా అడ్డుకున్న ట్రంప్ సర్కారు
- 3 మీడియా సంస్థల ప్రతినిధులకు మరోసారి నిరాకరణ
- విలేకరులపై 14 రోజుల పాటు నిషేధించిన ప్రభుత్వం
- తక్షణ విచారణ కోరుతూ మళ్లీ కోర్టు మెట్లెక్కిన జర్నలిస్టులు
- అసత్యాలు ప్రచారం చేస్తున్నారంటూ సెప్టెంబర్ 18 న ట్రంప్ ఫైర్




**వాషింగ్టన్ (సమయం న్యూస్):** జర్నలిస్టులను శ్వేతసౌధంలోకి అనుమతించాలని యూఎస్ కోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ ట్రంప్ సర్కారు విలేకరుల ప్రవేశాన్ని అడ్డుకుంది. గురువారం కూడా ఎమ్ఎస్ నౌ, సీఎన్ఎన్, పొలిటికో సంస్థల ప్రతినిధులకు శ్వేతసౌధంలోకి ప్రవేశం దక్కకపోవడంతో తీవ్ర సంచలనం రేగింది. ఈ పరిణామంతో బాధిత మీడియా సంస్థలు తమ కేసుపై తక్షణ విచారణ చేపట్టాలని కోరుతూ మరోసారి కోర్టు మెట్లెక్కాయి.

గతంలో జాతీయ భద్రతను కారణంగా చూపుతూ ఈ 3 మీడియా సంస్థల జర్నలిస్టులు శ్వేతసౌధంలోకి 14 రోజుల పాటు కాలుపెట్టకుండా ట్రంప్ ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ ఆంక్షలను సవాలు చేస్తూ సంబంధిత మీడియా సంస్థలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. విచారణ చేపట్టిన కోర్టు ట్రంప్ సర్కారు ఆదేశాలను కొట్టివేసింది. జర్నలిస్టులను నిషేధించేందుకు ప్రభుత్వం సరైన ఆధారాలు చూపించలేకపోయిందని, రాజ్యాంగపరమైన న్యాయప్రక్రియలను ఉల్లంఘించిందని న్యాయమూర్తి స్పష్టం చేశారు. వెంటనే జర్నలిస్టులను లోపలికి అనుమతించాలని ఆదేశించారు. కోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చినప్పటికీ అధికార యంత్రాంగం గురువారం నాడు కూడా విలేకరులను అనుమతించలేదు. దీంతో మీడియా సంస్థలు తమ న్యాయపోరాటాన్ని మరింత ముమ్మరం చేశాయి. సీఎన్ఎన్, ఎమ్ఎస్ నౌ, పొలిటికో మీడియా సంస్థలు అసత్యాలు వ్యాప్తి చేస్తున్నాయని సెప్టెంబర్ 18 న ట్రంప్ తీవ్రంగా ఆరోపించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ఇలాంటి సంస్థలకు శ్వేతసౌధంలో అవకాశం ఉండకూడదని ట్రంప్ పేర్కొన్న నేపథ్యంలో ఈ వివాదం మరింత తీవ్రరూపం దాల్చింది.



# గాన గంధర్వుడు ఎస్పీ బాలు

## నేడు ఎస్పీ బాలు వర్ధంతి

తెలుగు చలనచిత్ర రంగాన్ని, భారతీయ సంగీత సామ్రాజ్యాన్ని ఐదు దశాబ్దాలకు పైగా ఏకఛత్రాధిపత్యంతో ఏలిన అమర గాయకుడు, గాన గంధర్వుడు పద్మభూషణ్ డాక్టర్ శ్రీపతి పండితారాధ్యుల బాల సుబ్రహ్మణ్యం (ఎస్పీ బాలు) వర్ధంతి సందర్భంగా పలువురు ప్రముఖులు, అభిమానులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. 1946 జూన్ 4న నెల్లూరు జిల్లా కోనేటమ్మపేటలో జన్మించిన బాలు, హరికథా విద్వాంసుడైన తండ్రి సాంబమూర్తి ప్రోత్సాహంతో చిన్నతనం నుంచే హార్మోనియం, పిల్లనగ్రోవి వంటి వాద్యాలు నేర్చుకుంటూ సంగీతంపై మక్కువ పెంచుకున్నారు. ఇంజనీరింగ్ చదివేందుకు మద్రాస్ వెళ్లిన ఆయన, 1964లో మద్రాస్ తెలుగు కల్చరల్ ఆర్గనైజేషన్ నిర్వహించిన పాటల పోటీలో ప్రథమ బహుమతి సాధించి తన జీవితంలో కీలక మలుపు తిరిగారు.

1966లో ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్.పి. కోదండపాణి సంగీత దర్శకత్వంలో, పద్మనాభం నిర్మించిన 'శ్రీ శ్రీ శ్రీ మర్యాద రామన్న' చిత్రం ద్వారా బాలు గాయకుడిగా పరిచయమయ్యారు. తనకు జన్మనిచ్చిన సంగీత దర్శకుడిపై భక్తితో చెన్నైలోని తన ఆడియో ల్యాబ్‌కు "కోదండపాణి ఆడియో ల్యాబ్స్" అని పేరు పెట్టుకోవడం ఆయన సంస్కారానికి నిదర్శనం. శాస్త్రీయ సంగీతంలో ఎలాంటి అధికారిక శిక్షణ లేకపోయినా, భావయుక్తమైన ఉచ్చారణ, స్వర లయల కూర్పుతో ఘంటసాల తర్వాత తెలుగు సినీ పాటకు సిసలైన వారసుడిగా నిలిచారు. శంకరాభరణం, సాగరసంగమం, ఏక్ దూజే కేలియే వంటి చిత్రాలు ఆయన గళంలో అమరకావ్యాలుగా నిలిచాయి.

తన సుదీర్ఘ ప్రస్థానంలో 11 భాషల్లో 40 వేలకు పైగా పాటలు పాడి, 40 సినిమాలకు సంగీత దర్శకత్వం వహించి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించారు. భారత ప్రభుత్వం నుండి పద్మశ్రీ (2001), పద్మభూషణ్ (2011), నంది పురస్కారాలు (గాయకుడిగా, నటుడిగా, సంగీత దర్శకుడిగా 29 సార్లు) అందుకున్నారు. 2016లో గోవాలో జరిగిన 47వ అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలలో (×ఖీఖీ×) 'సెంటినరీ అవార్డ్ ఫర్ ఇండియన్ ఫిల్మ్ పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్' పురస్కారం పొందారు. అంతేకాకుండా 1996లో ప్రారంభించిన 'పాడుతా తీయగా' కార్యక్రమం ద్వారా వందలాది మంది నూతన గాయనీ గాయకులను వెండితెరకు పరిచయం చేశారు.

ఎన్టీఆర్, అక్కినేని, కృష్ణ, శోభన్ బాబు, ఎమ్జీఆర్, శివాజీ గణేషన్ల నుంచి నేటి తరం నటుల వరకు ప్రతి ఒక్కరి స్వరాకారానికి అనుగుణంగా పాడి ప్రాణం పోసిన బాలు, కరోనా సంబంధిత సమస్యలతో చికిత్స పొందుతూ 2020 సెప్టెంబర్ 25న అంతిమ శ్వాస విడిచారు. పాటతోనే పెనవేసుకున్న తన అనుబంధానికి గుర్తుగా తన పిల్లలకు చరణ్, పల్లవి అని పేర్లు పెట్టుకున్న గాన గంధర్వుడు ఎస్పీ బాలు భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన పాటల రూపంలో నిత్యనూతనంగా జీవించే ఉంటారు.



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# వైద్యులకు రోగులకు వారధులు ఫార్మసిస్టులు

## నేడు ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవం



ఆరోగ్యంపై ప్రతి వారికీ శ్రద్ధ ఉండడం సహజం. ఆరోగ్యం కోసం ప్రపంచంలోని ప్రతి ఒక్కరూ నానా పాట్లు పడుతుంటారు. చికిత్స కన్నా, నివారణే నయమని, ఇప్పుడిప్పుడే చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఏ చిన్నపాటి రోగం వచ్చినా, వెంటనే మందులు తీసుకుంటున్నారు. ఆరోగ్య మెరుగుదలలో మందులు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ఇంతకూ మందులను ఎవరు మెరుగు పరుస్తారో, ఎవరు తయారు చేస్తారో తెలుసా? ఫార్మాసిస్టులు. వైద్య బృందంలో ఫార్మసిస్టుల ప్రాముఖ్యత ఎంతో ఉంది. చికిత్స, ఉత్పత్తులను సమర్థవంతంగా ఉపయోగించడం ద్వారా రోగులకు ఆరోగ్య సేవలను మెరుగు పరచడం ఔషధ నిపుణుల ప్రాథమిక లక్ష్యం. అందువల్ల, ఫార్మసిస్ట్ యొక్క ప్రాముఖ్యత, పాత్ర గురించి అవగాహన పెంచడానికి ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 25 న ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ప్రపంచ ఫార్మసిస్ట్స్ దినోత్సవంను సెప్టెంబర్ 25 న ఇంటర్నేషనల్ ఫార్మాస్యూటికల్ ఫెడరేషన్ (ఎఫ్ఐపి) ప్రకటించింది. ఈ సందర్భంగా ఫార్మాసిస్టులు మానవాళి ఆరోగ్యాన్ని మెరుగు పరిచేందుకు ఎలాంటి పాత్ర పోషిస్తారో, వైద్య ప్రపంచంలో ఫార్మాసిస్టుల పాత్ర ఏమిటో తెలుసు కోవాల్సిన అవసరం అనివార్యంగా ఉంది. వాస్తవానికి ఫార్మాసిస్టు రెండో వైద్యుడిగా పరిగణించబడతాడు. రోగులకు కావాల్సిన మందులను, ఏ రోగికి ఎంత మోతాదులో కావాలో నిర్ధారిస్తాడు. అంతేకాదు వాటి వల్ల ప్రయోజనాలు కలిగేలా చేస్తాడు. దుష్ప్రభావాలు కలగకుండా మార్గ నిర్దేశాలు చేస్తాడు. క్లినికల్ ఫలితాలను మెరుగు పరచడానికి మందులు వాటి వాడే పద్ధతిని, సురక్షితమైన వాడకాన్ని కూడా ప్రోత్సహిస్తాడు.

ప్రపంచం లోని ప్రతి ఒక్క రోగికీ అందరికీ సురక్షితమైన మరియు సమర్థ వంతమైన మందులు అందించేందుకు అనుక్షణం ఫార్మా సిస్టులు కృషి సల్పుతారు. ఔషధాల వాడకాన్ని మెరుగు పరచి, రోగుల భద్రతను నిర్ధారించే మరియు పరిరక్షించేందుకు ఫార్మాసిస్టులు అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తారు. ప్రజల ఆరోగ్య భద్రత రీత్యా మెడిసిన్స్ లోని లోపాలను తగ్గించేందుకు ఫార్మాసిస్టులు ఎక్కువగా కృషి చేస్తారు. ఫార్మాసిస్టులు వారి విస్తృత జ్ఞానం మరియు నైపుణ్యాన్ని ప్రజల ఆరోగ్యాల కోసం ఉపయోగిస్తారు. ఏ ఒక్క రోగిని హాని కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత వారిపై ఉందనే విషయాన్ని అనుక్షణం గుర్తుంచుకుని, పని చేస్తారు. వారు తయారు చేసిన మెడిసిన్స్ నుండి ఉత్తమ ఫలితం వచ్చేలా చాలా కృషి చేస్తారు. చాలా మంది వారి పని, తాము సూచించిన మందులను అప్పగించడమే అనుకుంటారు. కానీ జ్ఞానం, అనుభవరం పరంగా వారు డాక్టర్ కంటే ఏ మాత్రం తక్కువ కాదు. ఫార్మాసిస్టులకు మెడిసిన్స్, వాటి దుష్ప్రభావాల గురించి సంపూర్ణ అవగాహన ఉంటుంది. ప్రధానంగా వైద్యుల వద్దకు వెళ్లలేని, వైద్యం చేయించుకోలేని నిరు పేదలకు, ఔషధాలను అందించడం లోనూ వారు ఎక్కువ బాధ్యత వహిస్తారు.




ఫార్మాసిస్టును కూడా ఒకరకంగా వైద్యుడి లాగే తెల్లటి కోటు ధరించి, మందులు పంపిణీ చేసే ఆరోగ్య సంరక్షక నిపుణుడిలా భావించ వచ్చు. కాని ఔషధ పంపిణీకి మించి ఫార్మాసిస్టు పాత్ర విస్తరిస్తుందని మనం తెలుసుకోవాలి. రోగులకు హాని లేదా మరణానికి మరో ప్రధాన కారణం ఔషధ లోపం అని కొన్ని అధ్యయనాలు చెపుతున్నాయి. లోపం తరచుగా శాశ్వత అవయవ నష్టం, పక్షవాతం లేదా మరణానికి దారి తీస్తుంది. ఔషధ లోపం, వాటిని నివారించడంలో ఫార్మాసిస్టుల వల్ల కలిగే పరిణామాలను చూసిన ఈరోజును ఇంటర్నేషనల్ ఫార్మాస్యూటికల్ ఫెడరేషన్ 2009 ఇస్తాంబుల్ (టర్కీ)లో జరిగిన వరల్డ్ కాంగ్రెస్ ఆఫ్ ఫార్మసీ అండ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ లో గుర్తించింది. కానీ అంతకు ముందే 1912 సంవత్సరం లోనే సెప్టెంబర్ 25న ఫార్మాసిస్టు డే జరుపు కోవడానికి ఎంపిక చేయ బడింది. అప్పటి నుండి ఫార్మాస్యూటికల్ ఫెడరేషన్ ప్రారంభించ బడింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రపంచ వ్యాప్తంగా కనీసం 2.6 మిలియన్ ఫార్మసిస్టులు ఇతర ఫార్మాస్యూటికల్ సిబ్బంది ఉన్నట్లు అంచనా వేసింది. ఆరోగ్య కరమైన జీవనానికి సలహా ఇవ్వడం, వ్యాధిని నివారించడానికి టీకాలు వేయడం మందులు సరిగ్గా తీసుకునేలా చూడడం, తద్వారా వ్యాధులను చక్కగా నయం చేయడం, జీవిత నాణ్యతను మెరుగు పరచడం, సురక్షితమైన మరియు సమర్థ వంతమైన మందులు మరియు వ్యాక్సిన్లను అభివృద్ధి చేయడం ద్వారా ఔషధ శాస్త్రవేత్తలు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చేస్తున్న సేవలు అమోఘం. ప్రపంచ ఫార్మాసిస్ట్ దినోత్సవం అంటే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అందరూ ఫార్మాసిస్టుల సేవలను గుర్తించి, ఔషధ తయారీ నుండి, వలసిన వారికి పంపిణీ, మందులు వాడే విధానం వరకు, అసమాన, అమూల్య సేవలు అందిస్తున్న, వారి ప్రతిభావంత మైన పాత్రకు సముచిత గౌరవం ఇవ్వడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తించాలి. ప్రధానంగా ప్రస్తుత పరిస్థితులలో కరోనా వైరస్ యొక్క వ్యాప్తిని ఆపడానికి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఫార్మసిస్ట్‌లు అవిశ్రాంతంగా కృషి వెల కట్టలేనిది. ప్రజలకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచడం, పంపిణీ చేయడం, కుటుంబ సభ్యులకు దూరంగా, స్వార్థం మరిచి, మానవ సేవే పరమార్థంగా, ఈ క్లిష్ట సమయంలో ఫార్మాసిస్టులు చేస్తున్న సేవలకు ప్రతి ఒక్కరూ ప్రోత్సాహం అందించి, కృతజ్ఞతలు ప్రకటించాల్సిన సమయం ఇది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# తెలుగు నవలా సాహిత్య వైతాళికుడు ఉన్నవ

## నేడు ఉన్నవ లక్ష్మీనారాయణ వర్ధంతి

**గాంధేయ వాదిగా, న్యాయవాదిగా, సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర్య యోధుడుగా, ఉద్యమ నాయకునిగా, స్త్రీ విద్య ప్రోత్సాహికునిగా, కాంగ్రెస్ నేతగా, దళిత జనోద్ధారకునిగా, ప్రధానంగా తెలుగు నవలా సాహిత్య వైతాళికుడుగా ఉన్నవ లక్ష్మీ నారాయణ తెలుగు వారికి సుపరిచితుడే. ముఖ్యంగా నాటి సాంఘిక దురాచారాలను ప్రతిబింబించే, మాలపల్లి నవల నాడు ఒక సంచలనమే. సాంఘిక, ఆర్థిక అసమానతలను తొలగించి, కులవ్యవస్థను నిరసించి, అందరూ సమానులే అన్న భావనతో, అగ్రవర్ణాలు, హరిజనులు అందరూ కలసి మెలసి ఉండాలని కోరుకుంటూ, మాలపల్లి అనే విప్లవాత్మకమైన నవలను రచించడం, తన దృక్పథానికి మద్దతుగా, సహ పంక్తి భోజనాలు నిర్వహించడం ఆ రోజులలో సాహసమే. మాలపల్లి తెలుగు సాహితీ చరిత్రలోనూ, సామాజిక దృక్పథంలోనూ ఒక నూతన ఒరవడిని సృష్టికి, చర్చోప చర్చలకు కారణభూతమైంది.**



ఉన్నవ లక్ష్మీనారాయణ గుంటూరు జిల్లా అప్పటి సత్తెనపల్లి తాలూకా వేములూరుపాడు గ్రామంలో 1877 డిసెంబరు 4వ తేదీన శ్రీరాములు, శేషమ్మ దంపతులకు జన్మించి, ప్రాథమిక విద్య స్వగ్రామంలోనే సాగించాడు. 1897లో గుంటూరులో మెట్రిక్యులేషన్ చదివాడు. 1906లో రాజమండ్రి ఉపాధ్యాయ శిక్షాణా కళాశాలలో శిక్షణ పొందాడు. 1916లో బర్లాండ్, డబ్లిన్‌లలో బారిష్టర్ చదువు సాధించాడు. గాంధేయ వాదిగా, సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర్య యోధుడుగా, తెలుగు నవలా సాహిత్య వైతాళికుడుగా విశేషమైన కీర్తి పొంది, సాహిత్యం ద్వారా హరిజనోద్ధరణకు కృషి చేశాడు. గుంటూరులో శ్రీ శారదా నికేతన్ ను స్థాపించి, స్త్రీ విద్యను ప్రోత్సహించాడు. కందుకూరి వీరేశలింగం పంతులు అధ్యక్షతలో తొలి వితంతు వివాహం జరిపించిన సంస్కర్తగా నిలిచాడు. 1900 లో గుంటూరులో "యంగ్‌మెన్స్ లిటరరీ అసోసియేషన్"ను స్థాపించాడు. 1902లో అక్కడే వితంతు శరణాలయాన్ని స్థాపించాడు. వీరేశలింగం స్థాపించిన వితంతు శరణాలయాన్ని 1906 లోను, పూనాలోని కార్వే మహిళా విద్యాలయాన్ని, 1912 లోను సందర్శించి అనుభవాలను లక్ష్యానికి జోడించారు. 1913 లో జొన్నవిత్తుల గురునాథంతో కలసి విశాలాంధ్ర పటం తయారు చేశాడు. లక్ష్మీనారాయణ 1900లో గుంటూరులో ఉపాధ్యాయ వృత్తి, 1903లో అక్కడే న్యాయవాద వృత్తిని, 1908లో ర్యాలీ కంపెనీలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించాడు. రష్యాలో 1917లో జరిగిన బోల్షవిక్ విప్లవం వల్ల స్ఫూర్తి పొందిన మొదటి తెలుగు కవి ఉన్నవ. కూలీల పక్షం వహించి కవులు రచనలు చేయడానికి ప్రేరణ నిచ్చింది సదరు రష్యా విప్లవ ప్రభావమే. 1917 లో మద్రాసు హైకోర్టులో న్యాయవాదిగా పనిచేశాడు. 1922లో గుంటూరులో శారదానికేతన్‌ను స్థాపించి బాలికలకు విద్య నేర్చుకునే అవకాశం కల్పించాడు. 1922 లో మాలపల్లి నవలను బెల్లంకొండ రాఘవరావు ముద్రించగా, మద్రాసు ప్రభుత్వం మాలపల్లి నవలపై నిషేధం విధించింది. రాజకీయ వాతావరణాన్ని, గాంధీ మహాత్ముని ఆశయాల్ని, తెలుగువారి జీవన విధానాన్ని ప్రతిబింబించిన నవల మాలపల్లి. ఆ నవలలో సాంఘిక దురాచారాలు, జాతీయ సత్యాగ్రహ ఉద్యమాలు, వర్ణ , వర్గ వ్యత్యాసాలు తదితర ఆ నాటి పరిస్థితులను కల గలిపి, కళ్ళకు కట్టినట్లు ఉన్నవ చిత్రించడం విశేషం. ఆనాడు హరిజనుల కుటుంబ గాథను ఇతివృత్తంగా ఎన్నుకొని నవల వ్రాయడమే సాహసం. 1926 లో మద్రాసు శాసన మండలిలో మాలపల్లి నిషేధంపై చర్చలు జరగడం, 1928 లో కొన్ని మార్పులతో మాలపల్లి ప్రచురణకు తిరిగి అనుమతి లభించడం, మద్రాసు ప్రభుత్వం ఆంధ్ర విశ్వ విద్యాలయం మాలపల్లిని ప్రచురించి, ఆ నవలను పాఠ్య గ్రంథంగా ఎంపిక చేయడం, 1936 లో మద్రాసు ప్రభుత్వం మాలపల్లి నవలపై రెండోసారి నిషేధం తెలిపి ఆ నవలను పాఠ్యగ్రంథంగా తొలగించడం, 1937లో చక్రవర్తుల రాజగోపాలా చారి మద్రాసు ప్రధానిగా ఎన్నికైనప్పుడు తొలి కాంగ్రెసు మంత్రి వర్గంచే మాలపల్లి నవలపై నిషేధపు ఉత్తర్వులను రద్దు చేయించడం క్రమానుగతంగా జరిగిపోయాయి. సామాన్య ప్రజల సంక్షేమం, అభ్యుదయాన్ని కోరే కవిత్వం ప్రజలకు సులభంగా అర్థమయ్యే వాడుక భాషలో ఉండాలన్న లక్ష్యంతో మాలపల్లి నవలలో చరమగీతం, సమతాధర్మం అనే రెండు గేయ కవితల్ని సామాన్య ప్రజలకు అర్థమయ్యే నిత్య వాడుక భాషలో జానపద గేయ రీతుల్లో రచించాడు. ఆ నవలకు కాశీనాథుని నాగేశ్వరరావు పీఠిక వ్రాస్తూ, "ఆంధ్ర సాహిత్య హృదయ పరిణామాన్ని గ్రహించడానికి మాలపల్లి ఉత్తమ కావ్యం అని, తెనుగు మాటలు, తెనుగు దేశము, తెనుగు హృదయము, తెనుగు సంకల్పము, మాలపల్లి నవలకు అనిర్వచనీయ ప్రతిభను సమకూర్చాయి" అని కొనియాడాడు. అందుకే తెలుగు సాహిత్యంలో వచ్చిన తొలి విప్లవ నవలగా గుర్తింపు పొందింది. మాలపల్లి, నాయకురాలు, బుడబుక్కల జోస్యం, స్వరాజ్య సోది, భావ తరంగాలు తదితర రచనలు చేశాడు. ఇక 1923 లో కాంగ్రెసు స్వరాజ్య పార్టీలో చేరాడు. ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు కమిటీ కార్యదర్శిగా ఎన్నికై, పల్నాడు సత్యాగ్రహ ఉద్యమానికి నాయకత్వం వహించాడు. 1931లో ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో చేరినందుకు, 1942 లో క్విట్ ఇండియా ఉద్యమంలో చేరినందుకు జైలు శిక్ష అనుభవించాడు.

గాంధేయ వాదిగా, సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర్య యోధునిగా తెలుగు నవలా సాహిత్య వైతాళికుడుగా కీర్తి పొందిన ఉన్నవ 1958 సెప్టెంబరు 25 న మరణించాడు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# ఆరేళ్ల బాలిక.. రూబిక్స్ క్యూబ్‌లో ప్రపంచ రికార్డు



**చైనా, సెప్టెంబర్ 24 (సమయం న్యూస్):** వయసు కేవలం ఆరేళ్లు.. కానీ ప్రతిభ మాత్రం ప్రపంచస్థాయి. చైనాకు చెందిన లియాన్ యున్‌జి అలియాస్ 'జిజి' 3ఇ3 రూబిక్స్ క్యూబ్‌ను సగటున కేవలం 4.27 సెకన్లలో పరిష్కరించి మహిళల ప్రపంచ రికార్డు నెలకొల్పింది. 4.5 సెకన్లలోపు ఈ ఘనత సాధించిన తొలి మహిళగా చరిత్ర సృష్టించింది. సిచువాన్ ప్రావిన్స్‌లోని చెంగ్డూకు చెందిన లియాన్ ఈ సెప్టెంబరులోనే తన రికార్డును రెండుసార్లు మెరుగుపరుచుకుంది. వుహాన్‌లో జరిగిన ప్రపంచ క్యూబ్ సంఘం గుర్తింపు పొందిన పోటీలో తొలుత 4.52 సెకన్ల సగటు సమయాన్ని నమోదు చేసింది. ఆ తర్వాత కేవలం మూడు రోజులకే గ్వాంగ్‌జౌలో జరిగిన పోటీలో 4.27 సెకన్లకు మెరుగుపరిచింది. ఐదు ప్రయత్నాల సగటు సమయాన్ని రికార్డుగా పరిగణిస్తారు. ఇందులో ఒకసారి ఆమె కేవలం 3.54 సెకన్లలోనే క్యూబ్‌ను పరిష్కరించింది. నాలుగేళ్ల వయసులో తొలిసారి రూబిక్స్ క్యూబ్‌ను ప్రయత్నించిన లియాన్‌కు అప్పట్లో ఒక క్యూబ్‌ను పూర్తి చేసేందుకు 90 సెకన్లు పట్టేది. రెండేళ్లుగా రోజుకు రెండు నుంచి మూడు గంటలపాటు సాధన చేస్తూ.. క్యూబ్‌ను పరిష్కరించేందుకు అవసరమైన 1,300కు పైగా అల్గారిథమ్స్‌పై పట్టు సాధించింది. రూబిక్స్ క్యూబ్ సాధనతో పిల్లల్లో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, తార్కిక ఆలోచన, ప్రాదేశిక అవగాహన వంటి నైపుణ్యాలు పెరుగుతాయని లియాన్ తల్లి లిన్ యాంగ్జీ తెలిపారు. పోటీల్లో అత్యంత వేగంగా క్యూబ్‌ను పరిష్కరించిన అనంతరం లియాన్ ఆనందంతో గంతులు వేస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో ఆకట్టుకుంటున్నాయి. లియాన్ సాధించిన 4.27 సెకన్ల సగటు సమయాన్ని 3ఇ3ఇ3 విభాగంలో మహిళల కొత్త ప్రపంచ రికార్డుగా ప్రపంచ క్యూబ్ సంఘం అధికారికంగా గుర్తించింది. చిన్న వయసులోనే ప్రపంచ రికార్డు సాధించడంతో లియాన్ ప్రతిభపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# రహానే టెక్నిక్ సచిన్‌ను గుర్తు చేస్తుంది: స్టీవ్ వా



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24 (సమయం న్యూస్):** భారత మాజీ టెస్టు కెప్టెన్ అజింక్య రహానే బ్యాటింగ్ టెక్నిక్ తనకు క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌ను గుర్తు చేస్తుందని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ వా ప్రశంసించాడు. రహానే బ్యాటింగ్‌లోని కాంపాక్ట్ టెక్నిక్, చిన్న బ్యాక్‌లిఫ్ట్, సమతుల్యత, ప్రశాంతమైన ఆటతీరు సచిన్‌ను తలపిస్తాయని పేర్కొన్నాడు. రహానేను సచిన్ స్ఫూర్తిగా తీసుకుని తన ఆటను తీర్చిదిద్దుకున్నాడా? అని స్టీవ్ వా ప్రశ్నించాడు. దీనికి రహానే స్పందిస్తూ.. చిన్నప్పటి నుంచే సచిన్ తనకు ఆరాధ్య దైవమని చెప్పాడు. ముంబైలో పెరిగిన తనలాంటి ఎంతోమందికి సచిన్ రోల్ మోడల్ అని తెలిపాడు. చిన్నతనంలో క్రికెట్ ఆడేటప్పుడు సచిన్ బ్యాక్‌లిఫ్ట్, చేతుల కదలిక, స్ట్రెయిట్ డ్రైవ్‌ను అనుకరించేవాడినని గుర్తుచేసుకున్నాడు. తర్వాత ఫస్ట్‌క్లాస్, అంతర్జాతీయ క్రికెట్‌లో సచిన్‌తో కలిసి ఆడే అవకాశం రావడం తన అదృష్టమని రహానే పేర్కొన్నాడు. సచిన్‌ను చిన్నప్పటి నుంచే ఆరాధించిన తాను.. ఆయనతో కలిసి డ్రెస్సింగ్ రూమ్ పంచుకోవడం ప్రత్యేక అనుభూతి అని చెప్పాడు. సంభాషణ సరదాగా సాగుతున్న సమయంలో స్టీవ్ వా.. "సచిన్ అంత డబ్బు సంపాదించావా?" అని రహానేను అడిగాడు. దీనికి రహానే ఏమాత్రం తడుముకోకుండా.. "బహుశా ఇప్పటి నుంచి సంపాదిస్తానేమో" అంటూ చమత్కారంగా సమాధానం ఇచ్చాడు. దీంతో వీరిద్దరి సంభాషణకు సంబంధించిన అంశం ఆసక్తికరంగా మారింది. అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన రహానే ప్రస్తుతం స్టీవ్ వాకు చెందిన ఆమ్‌స్టర్‌డామ్ ఫ్లేమ్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్‌లో ఆడుతున్న రహానే టెక్నిక్, ప్రశాంత స్వభావాన్ని స్టీవ్ వా గతంలోనూ ప్రశంసించిన విషయం తెలిసిందే.

# ఆటగాళ్ల గాయాలపై సీఓఈ తీరుపై అశ్విన్ తీవ్ర విమర్శలు



**చైనా, సెప్టెంబర్ 24 (సమయం న్యూస్):** భారత క్రికెటర్ల గాయాలు, పునరావాస (రిహాబిలిటేషన్) నిర్వహణ విషయంలో బెంగళూరులోని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంశంపై భారత మాజీ తిరోగమన బౌలర్ (ఆఫ్‌స్పిన్నర్) రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ వేదికగా మాట్లాడుతూ, ఆటగాళ్ల గాయాల నిర్వహణలో స్పష్టమైన జవాబుదారీతనం అవసరమని స్పష్టం చేశారు. ఆటగాళ్లపై విపరీతమైన పనిభారం పడుతున్న దృష్ట్యా టెస్టులు, వన్డేలు, టీ20 మూడు ఫార్మాట్లకు వేర్వేరు జట్లను సిద్ధం చేయాల్సిన సమయం వచ్చిందని అశ్విన్ అభిప్రాయపడ్డారు. తమిళనాడు ప్రీమియర్ లీగ్ కోసం అనుమతి కోరినప్పటికీ మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిని సీఓఈ సమయానికి విడుదల చేయకపోవడాన్ని ఆయన ఉదాహరణగా ప్రస్తావించారు. నెల రోజుల్లో కోలుకోవాల్సిన ఆటగాడు అక్కడ మూడు నుండి నాలుగు నెలల పాటు ఉండిపోవాల్సి రావడం సీఓఈ పనితీరును ప్రశ్నిస్తోందని పేర్కొన్నారు. ఇటీవల జస్‌ప్రీత్ బుమ్రా గాయంపై సీఓఈ మరియు జాతీయ ఎంపిక (సెలెక్షన్) కమిటీ మధ్య సరియైన సమాచారం లేకపోవడం వల్లనే ఆయన శ్రీలంక పర్యటనకు దూరమయ్యారనే వార్తలు వచ్చాయి. మరోవైపు, ఆటగాళ్లకు అనుసరించే శిక్షణ విధానాలు కూడా గాయాలకు కారణమవుతాయని, 2015లో 'ఒలింపిక్ లిఫ్టింగ్' సాధన చేయడం వల్లనే తనకు నడుము పట్టుకుందని (సైడ్ స్ట్రెయిన్) అశ్విన్ గుర్తు చేసుకున్నారు. ఈ క్రమంలోనే గాయాల నిర్వహణను చక్కదిద్దేందుకు బీసీసీఐ నూతన క్రీడా విజ్ఞాన మరియు వైద్య విభాగం (స్పోర్ట్స్ సైన్స్ అండ్ మెడిసిన్) అధిపతి పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానించింది.

# రోహిత్‌తో బంధం ప్రత్యేకం: గంభీర్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24 (సమయం న్యూస్):** గౌతమ్ గంభీర్.. సీనియర్ ఆటగాడు రోహిత్ శర్మతో తనకున్న అనుబంధంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తమ మధ్య ఉన్నది కేవలం కెప్టెన్-కోచ్ సంబంధం మాత్రమే కాదని, ఇద్దరి ఆలోచనా విధానాలు ఒకరికొకరికి బాగా తెలుసని చెప్పాడు. వెస్టిండీస్‌తో వన్డే సిరీస్ నేపథ్యంలో గంభీర్ ఈ వ్యాఖ్యలు చేశాడు. రోహిత్ జట్టులోకి వచ్చినప్పటి నుంచే తమ మధ్య మంచి అనుబంధం ఉందని గంభీర్ తెలిపాడు. తాను సీనియర్ ఆటగాడిగా ఉన్న సమయంలో రోహిత్‌తో కలిసి పనిచేశానని గుర్తుచేశాడు. మైదానంలో కొన్నిసార్లు ఆలోచనలు వేర్వేరుగా ఉన్నప్పటికీ.. చివరికి జట్టు ప్రయోజనాలే ఇద్దరికీ ముఖ్యమని పేర్కొన్నాడు. 2024 జులైలో హెడ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి రోహిత్, సూర్యకుమార్ యాదవ్, శ్రేయస్ అయ్యర్, శుభ్‌మన్ గిల్‌తో కలిసి పనిచేశానని గంభీర్ చెప్పాడు. ఈ నలుగురిలోనూ జట్టుకే తొలి ప్రాధాన్యం ఇచ్చే లక్షణం ఉందని ప్రశంసించాడు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే జట్టు విజయాన్నే ముందుగా చూసే కెప్టెన్లతో పనిచేయడం తన అదృష్టమని పేర్కొన్నాడు. శ్రేయస్ అయ్యర్‌లో నాయకత్వ లక్షణాలను 2018లోనే గుర్తించానని గంభీర్ తెలిపాడు. అప్పట్లో ఢిల్లీ జట్టు కెప్టెన్సీని అతనికి అప్పగించిన విషయాన్ని గుర్తుచేశాడు. ప్రస్తుతం మళ్లీ శ్రేయస్‌తో కలిసి పనిచేసే అవకాశం రావడం సంతోషంగా ఉందన్నాడు. శుభ్‌మన్ గిల్ టెస్టు కెప్టెన్సీని కూడా గంభీర్ ప్రశంసించాడు. ఇంగ్లండ్ వంటి కఠినమైన పర్యటనలో ఐదు టెస్టులకు నాయకత్వం వహించడం పెద్ద సవాలేనని, అయినప్పటికీ గిల్ ఆ సవాలును అద్భుతంగా స్వీకరించాడని చెప్పాడు. రాబోయే సంవత్సరాల్లో గిల్ నుంచి మరింత అత్యుత్తమ ప్రదర్శన చూడొచ్చని గంభీర్ విశ్వాసం వ్యక్తం చేశాడు.



# తండ్రి సలహాతో ఆర్యవీర్ సెహ్వాగ్ బ్యాటింగ్





**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24 (సమయం న్యూస్):** భారత మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ పెద్ద కుమారుడు ఆర్యవీర్ సెహ్వాగ్ క్రికెట్‌లో తన ప్రయాణాన్ని ప్రారంభించాడు. ఇటీవల భారత అండర్-19 జట్టు తరఫున ఆస్ట్రేలియాతో జరిగిన యువ వన్డే సిరీస్‌లో అరంగేట్రం చేసిన 18 ఏళ్ల ఆర్యవీర్.. మూడు మ్యాచ్‌ల్లో 28, 47, 34 పరుగులు చేశాడు. అంతకుముందు ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో వెస్ట్ ఢిల్లీ లయన్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ఆస్ట్రేలియాతో సిరీస్‌లో తన ప్రదర్శనపై ఆర్యవీర్ కొంత అసంతృప్తి వ్యక్తం చేశాడు. మూడు మ్యాచ్‌ల్లోనూ మంచి ఆరంభాలు లభించినా వాటిని భారీ స్కోర్లుగా మలచలేకపోయానని చెప్పాడు. చివరి మ్యాచ్‌లోనూ కుదురుకున్న తర్వాత సిక్స్ కొట్టే ప్రయత్నంలో ఔటవడం నిరాశ కలిగించిందని తెలిపాడు. క్రికెట్‌లో గుర్తింపు పొందాలంటే భారీ పరుగులు చేయడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నాడు. తన ఇంటిపేరు, తండ్రి సాధించిన విజయాల వల్ల ఎలాంటి ఒత్తిడిని అనుభవించడం లేదని ఆర్యవీర్ స్పష్టం చేశాడు. వీరేంద్ర సెహ్వాగ్ వారసత్వం గురించి తాను గర్వపడుతున్నానని, ప్రశంసలు, విమర్శలను పట్టించుకోకుండా తన ఆట, ప్రక్రియపై దృష్టి పెట్టేలా మానసికంగా సిద్ధమవుతున్నానని చెప్పాడు. ఆస్ట్రేలియాతో అరంగేట్రం మ్యాచ్‌కు ముందు కొంత నర్వస్‌గా ఉన్నప్పటికీ.. ఆ జట్టు బౌలర్ల వేగాన్ని ఎదుర్కోవడం మంచి అనుభూతినిచ్చిందని ఆర్యవీర్ తెలిపాడు. ఈ సిరీస్ తనలో ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని పేర్కొన్నాడు. తండ్రి వీరేంద్ర సెహ్వాగ్ ఇచ్చే సలహాలను కూడా ఆర్యవీర్ వెల్లడించాడు. బ్యాటింగ్‌ను సాధ్యమైనంత సింపుల్‌గా ఉంచుకోవాలని తన తండ్రి సూచిస్తారని చెప్పాడు. కొట్టగల బంతిని కొట్టాలని, వదిలేయాల్సిన బంతిని వదిలేయాలని, అవసరమైతే డిఫెన్స్ ఆడాలని చెబుతారని తెలిపాడు. సోషల్ మీడియాలో వచ్చే వ్యాఖ్యలను పట్టించుకోకుండా టెక్నిక్‌తో పాటు మానసిక దృఢత్వంపై దృష్టి పెట్టాలని తండ్రి సూచిస్తున్నారని ఆర్యవీర్ చెప్పాడు.

## ఆసియా క్రీడల్లో భారత్-పాక్ మ్యాచ్ ఎప్పుడంటే?

**నాగోయా, సెప్టెంబర్ 24 (సమయం న్యూస్):** జపాన్‌లోని ఐచి-నగోయాలో జరుగుతున్న 20వ ఆసియా క్రీడల్లో పురుషుల క్రికెట్ పోటీలు సెప్టెంబరు 24 నుంచి ప్రారంభం కానున్నాయి. తొలి మ్యాచ్‌లో ఆతిథ్య జపాన్.. ఆఫ్ఘనిస్తాన్‌తో తలపడనుంది. ఆసియా క్రీడల చరిత్రలో క్రికెట్ పోటీలు నిర్వహించడం ఇది నాలుగోసారి. ఈసారి మొత్తం 10 జట్లు పతకాల కోసం పోటీ పడుతున్నాయి.

స్వర్ణం కోసం 10 జట్లు ర్యాంకింగ్‌ల ఆధారంగా భారత్, పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ నేరుగా క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధించాయి. పూర్తి సభ్య దేశంగా ఆఫ్ఘనిస్తాన్ కూడా ప్రధాన డ్రాలో నేరుగా చోటు దక్కించుకుంది. క్వాలిఫికేషన్ రౌండ్ ద్వారా హాంకాంగ్, మలేషియా, నేపాల్, ఒమన్ అర్హత సాధించాయి. ఆతిథ్య దేశం కావడంతో జపాన్‌కు నేరుగా ప్రవేశం లభించింది.

### భారత్-పాక్ మ్యాచ్ ఎప్పుడు?

ర్యాంకింగ్‌లో అగ్రస్థానంలో ఉన్న ఆరు జట్లలో జపాన్, ఆఫ్ఘనిస్తాన్, నేపాల్, ఒమన్, మలేషియా, హాంకాంగ్‌లను రెండు గ్రూపులుగా విభజించారు. ఒక్కో గ్రూపులో మూడు జట్లు ఉంటాయి. రౌండ్ రాబిన్ పద్ధతిలో జరిగే పోటీల్లో ప్రతి గ్రూపులో అగ్రస్థానంలో నిలిచే రెండు జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంటాయి. క్వార్టర్ ఫైనల్స్‌లో ఈ నాలుగు జట్లు భారత్, పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్‌తో తలపడతాయి. అనంతరం సెమీఫైనల్స్, ఫైనల్ జరుగుతాయి. ఈ ఫార్మాట్ ప్రకారం భారత్, పాకిస్థాన్ మధ్య మ్యాచ్ జరిగే అవకాశం ఫైనల్‌లోనే ఉంది. అయితే అందుకు ముందుగా రెండు జట్లూ తమ తమ క్వార్టర్, సెమీఫైనల్ మ్యాచ్‌ల్లో విజయం సాధించి తుదిపోరుకు అర్హత సాధించాల్సి ఉంటుంది

# "జార్జ్ క్రిష్'లో మానస వారణాసి



**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (సమయం న్యూస్):** హీరో శర్వానంద్, దర్శకుడు శ్రీను వైట్ల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'జార్జ్ క్రిష్'. ఈ సినిమాలో కథానాయికగా మానస వారణాసిని ఎంపిక చేసినట్లు చిత్రబృందం ప్రకటించింది. శర్వానంద్‌కు జోడీగా ఆమె కనిపించనున్నారు. 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాతో ఇటీవల గుర్తింపు తెచ్చుకున్న మానస.. తన నటనతో ప్రశంసలు అందుకున్నారు. 'జార్జ్ క్రిష్'లో ఆమె పాత్రకు ప్రాధాన్యం ఉంటుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. శర్వానంద్, శ్రీను వైట్ల తొలిసారి కలిసి పనిచేస్తుండటంతో ఈ సినిమాపై మొదటి నుంచే ఆసక్తి నెలకొంది. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై అనిల్ సుంకర సమర్పణలో రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. అజయ్ సుంకర సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. సంక్రాంతి కానుకగా సినిమాను విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. శర్వానంద్‌కు సంక్రాంతి సెంటిమెంట్ ఉండటంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ఇటీవలే పూజా కార్యక్రమాలతో సినిమా ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి నిర్మాత సురేశ్‌బాబు కెమెరా స్విచ్ఛాన్ చేయగా.. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ క్లాప్ కొట్టారు. తొలి షాట్‌కు శ్రీను వైట్ల దర్శకత్వం వహించారు. కేవీ గుహన్ ఛాయాగ్రహణం అందిస్తుండగా.. అనూప్ రూబెన్స్ సంగీతం సమకూరుస్తున్నారు. అవినాశ్ కొల్లా కళా దర్శకత్వం, అమర్ రెడ్డి కుడుముల ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నందు సవిరిగాన, గోపీ మోహన్ కథ అందిస్తున్నారు.




# 'సిగ్మా' చిత్ర ఆవిష్కరణ వేడుకకు చిరంజీవి

## అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సినిమా విడుదల.

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (సమయం న్యూస్):** యువ నటుడు సందీప్ కిషన్ కథానాయకుడిగా నటిస్తున్న సరికొత్త చిత్రం 'సిగ్మా' ప్రచార కార్యక్రమాలు జోరందుకున్నాయి. సెప్టెంబర్ 25న హైదరాబాద్‌లోని పార్క్ హయత్‌లో సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్న ఈ చిత్ర పూర్వ విడుదల (ప్రీ-రిలీజ్) వేడుకకు టాలీవుడ్ అగ్ర నటుడు చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ సామాజిక మాధ్యమాల ద్వారా అధికారికంగా ప్రకటిచడంతో చిత్రంపై అంచనాలు పెరిగాయి.

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ ఈ చిత్రంతో సంవిధానకర్తగా (దర్శకుడిగా) చిత్రసీమలోకి ప్రవేశిస్తుండటం విశేషం. సుభాస్కరన్ నేతృత్వంలోని 'లైకా ప్రొడక్షన్స్' నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటించగా, తమన్ సంగీతాన్ని అందించారు. తెలుగు రాష్ట్రాలలో ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ పంపిణీ చేస్తుండగా, గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.



# రష్మీ దేశాయ్ తొలినాళ్ల కష్టాలు చేదు అనుభవాలు

**ముంబై, సెప్టెంబర్ 24 (సమయం న్యూస్):** బుల్లితెరపై ఎంతో సంతోషంగా కనిపించే నటీనటుల జీవితాల వెనుక తీవ్రమైన పోరాటాలు, కన్నీళ్లు దాగి ఉంటాయనడానికి ప్రముఖ టెలివిజన్ నటి, 'బిగ్ బాస్' ఫేమ్ రష్మీ దేశాయ్ ఎదుర్కొన్న పరిస్థితులే నిదర్శనంగా నిలుస్తున్నాయి. కెరీర్ ప్రారంభంలోనూ, ఆ తర్వాత వ్యక్తిగత జీవితంలోనూ తాను ఎదుర్కొన్న భయానక ఘటనలను, ఆర్థిక సంక్షోభాన్ని ఆమె ఒక సంభాషణలో గుర్తుచేసుకున్నారు. కేవలం 16 ఏళ్ల పిన్న వయసులోనే ఒక ఆడిషన్‌కు వెళ్లిన సమయంలో తీవ్ర చేదు అనుభవం ఎదురైందని ఆమె తెలిపారు. అక్కడ మరెవరూ లేకపోవడంతో సందేహం వచ్చిందని, ఒక వ్యక్తి తనకు మత్తు పదార్థం కలిపిన పానీయాన్ని ఇచ్చి స్పృహ కోల్పోయేలా చేసేందుకు ప్రయత్నించగా, వెంటనే అప్రమత్తమై అక్కడి నుంచి తప్పించుకుని బయటపడినట్లు వెల్లడించారు. అంతేకాకుండా భర్తతో విడిపోయిన అనంతరం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను అనుభవించానని ఆమె పేర్కొన్నారు. ఇల్లు కొనుగోలు రుణాలతో పాటు రూ. 3.25 కోట్ల అప్పుల్లో ఉన్న సమయంలో చేస్తున్న ధారావాహిక కూడా ఆగిపోవడంతో రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని చెప్పారు. ఆ క్లిష్ట సమయంలో నాలుగు రోజుల పాటు తన సొంత కారులోనే గడపాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాథమిక దశలో చిన్న బడ్జెట్ చిత్రాల్లో నటిస్తూ కెరీర్ ప్రారంభించిన రష్మీ, ఆ తర్వాత హిందీ బుల్లితెరపై నటిగా, రియాలిటీ కార్యక్రమాల ద్వారా విశేషమైన గుర్తింపును సంపాదించుకున్నారు.

# 'గుండెనిండా గుడిగంటలు' అమూల్య గౌడ సందడి

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (సమయం న్యూస్):** తెలుగు బుల్లితెరపై ప్రసారమయ్యే ధారావాహికలు, వాటిలోని నటీనటులు వెండితెర తారల స్థాయిలో విశేష ఆదరణ సొంతం చేసుకుంటున్నారు. ప్రస్తుతం 'స్టార్ మా' వేదికగా ప్రసారమవుతున్న ప్రముఖ ధారావాహిక 'గుండెనిండా గుడిగంటలు'లో 'మీనా' అనే పాత్రలో నటిస్తూ కన్నడ నటి అమూల్య గౌడ తెలుగు ప్రేక్షకులకు ఎంతో దగ్గరయ్యారు. కుటుంబ విలువలకు ప్రాధాన్యతనిచ్చే అమాయకపు అమ్మాయిగా భావోద్వేగ సన్నివేశాల్లో సహజ నటనను కనబరుస్తూ ఆమె మంచి ప్రజాదరణ పొందారు. గతంలో కన్నడ సీరియల్ 'శ్రీగౌరీ' ద్వారా నటనా ప్రయాణాన్ని ప్రారంభించి, అక్కడ 'బిగ్ బాస్' రియాలిటీ కార్యక్రమంలోనూ పాల్గొని అమూల్య మంచి పేరు సంపాదించుకున్నారు. ధారావాహికలో సాంప్రదాయ చీరకట్టులో కనిపించే ఈ నటి, సామాజిక మాధ్యమాలలో మాత్రం ఆధునిక దుస్తులతో కూడిన విభిన్న రూపాలతో (స్టైలిష్ లుక్స్) నెటిజన్లను ఆకట్టుకుంటున్నారు. ప్రస్తుతం ఈమెకు అంతర్జాలంలో 5 లక్షలకు పైగా అనుచరులు (ఫాలోవర్లు) ఉండగా, ఆమె పంచుకునే చిత్రాలు సామాజిక మాధ్యమాలలో విశేషంగా వైరల్ అవుతున్నాయి.



Printed, Published by **Mohammed Murthuza.** Printed at NUTAN OFFSET PRINTERS, R.S.NO. 434, PLOT NO 16,17, AUTO NAGAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520007. Ediotr: **MOHAMMED MURTHUZA,** PRGI No:APTEL/26/A3949, www.samayam.net Mobile No. **7036644111, 9490140565**